thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 189 | జగిత్యాల ఆదివారం 18 అక్టోబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

అంతర్జాతీయ క్రీడా టోర్నీలకు 50 కోట్ల సాయం!



11

దాండియా సంబరాల్లో మృత్యుఘోష!



- వేడుకల వేళ విద్యార్థులపై కుప్పకూలిన భారీ లైటింగ్ స్టాండ్
- ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో తీవ్ర విషాదం
- వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ దుర్మరణం
- మరో 25 మందికి గాయాలు.. ఐదుగురి పరిస్థితి విషమం
- ఈదురుగాలుల ధాటికి లైటింగ్ క్రేన్ కూలినట్లు ప్రాథమిక సమాచారం
- ఘటనపై సీఎం దిగ్భ్రాంతి.. సమగ్ర విచారణకు ఆదేశం

హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలేజీలో నిర్వహిస్తున్న 'సంగమం-2026' టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల్లో తీవ్ర విషాదం నిండింది. వేడుకల ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ ఇనుప విద్యుత్ దీపాల స్టాండ్ ఒక్కసారిగా అక్కడ ఉన్న విద్యార్థులపై కుప్పకూలింది. ఈ ఘోర ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సోనీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆమెతో పాటు మరో 25 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో మృతురాలి సోదరితో సహా ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం అందుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన కళాశాల యాజమాన్యం, పోలీసులు బాధితులను ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆసుపత్రికి, ఆదిభట్లలోని ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.



వివరాలు 2లో..



పండుగ పిలుపు
పల్లెబాట పట్టిన పట్నం!

- దసరా వేళ సొంతూళ్లకు నగరవాసుల పరుగులు
- ప్రయాణికులతో కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లు
- రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులతో ఆర్టీసీ ఏర్పాట్లు
- నగర శివార్ల నుంచే జిల్లాలకు ప్రత్యేక సర్వీసులు
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం

వివరాలు 2వ పేజీలో

దసరా పండుగ నేపథ్యంలో భాగ్యనగరం నుంచి పల్లెలకు జనప్రవాహం మొదలైంది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు కుటుంబ సభ్యులతో కలిసి సొంతూళ్లకు పయనమవుతున్నారు. దీంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్)లో ఎటుచూసినా ప్రయాణికుల సందడే కనిపిస్తోంది. ప్లాట్‌ఫారాలు, నిరీక్షణ గదులు నిండిపోవడంతో రద్దీని నియంత్రించడం ఆర్టీసీ అధికారులకు సవాలుగా మారింది. రానున్న రోజుల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు పటిష్టమైన ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పండుగ వేళ కుటుంబాలతో కలిసి ఊళ్లకు వెళ్లే మహిళలకు ఈ సదుపాయం ప్రయాణ ఖర్చులను భారీగా తగ్గిస్తోంది. ప్రజలందరూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా ఆర్టీసీ సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు.

- హైదరాబాద్, అక్టోబర్ 17

నేడు ట్యాంక్‌బండ్‌పై పెద్ద బతుకమ్మ వేడుకలు

మహిళలంతా వేడుకల్లో పాల్గొనాలి

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

2

తెలంగాణలో తీవ్ర కరవు

- 315 మండలాల్లో కరవు ఛాయలు: తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్రంలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నట్టు గుర్తింపు
- కేంద్రం తక్షణమే సాయం చేయాలని కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్రవ్యాప్తంగా 23 శాతం వర్షపాత లోటు, 13 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు
- పంట నష్టపోయిన రైతులకు రూ.1,986 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రతిపాదన
- ప్రమాదకరంగా పడిపోయిన జలాశయాల నీటిమట్టాలు

4



సివిల్ సర్వీసెస్ అధికారుల హెరిటేజ్ వాక్

శిక్షణలో ఉన్న సుమారు 170 మంది సివిల్ సర్వీసెస్ అధికారుల కోసం పర్యాటక, వారసత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వారసత్వ పర్యటన శనివారం నిర్వహించారు.

3

గోదావరి-కావేరి లింక్‌తో రాష్ట్రానికి మరణ శాసనం

- బాబు కుట్రకు మద్దతు పలుకుతున్న రేవంత్
- తెలంగాణ ద్రోహులు మళ్లీ నిద్ర లేచారు
- తెలంగాణ నోట్లో మట్టికొడుతున్న 'చెయ్యి'!
- కావేరి ముసుగులో తెలంగాణ గొంతు కోస్తున్న బాబు
- దేవాదులలో పది మోటర్లు ఎందుకు నడపలేదు?
- మీ నిర్వాకం వల్ల వరంగల్ జిల్లా కరువు పాలైంది
- బీజేపీ నాయకులు ఏం చేస్తున్నరు?
- ఇంతమంది ఎంపీలున్న ఈ ద్రోహాన్ని అడ్డుకోలేదు
- నిప్పులు చెరిగిన హరీష్ రావు

3





ఆడబిడ్డల జీవితాల్లో ఆనందాల పూలవాన కురవాలి!

- ప్రజలకు సద్దుల బతుకమ్మ సీఎం శుభాకాంక్షలు
- ఆడబిడ్డల సంక్షేమమే అసలైన బతుకమ్మ స్ఫూర్తి: కేసీఆర్
- సమానత్వం, మహిళల ఐక్యతకు ప్రతీక: భట్టి విక్రమార్క

2



మురికి టాయిలెట్ ఫొటో పెడితే వెయ్యి రివార్డు

- వాహనదారులకు ఎన్‌హెచ్ఏఐ బంపర్ ఆఫర్
- టోల్‌ప్లాజాల్లో అపరిశుభ్ర మరుగుదొడ్లను గుర్తిస్తే బహుమతి
- రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో ఫొటో అప్‌లోడ్ చేస్తే చాలు
- ఫాస్టాగ్ రీఛార్జ్ రూపంలో రూ.వెయ్యి రివార్డు
- అక్టోబర్ 31 వరకు ప్రత్యేక కార్యక్రమం

4

పిల్లలకూ ఇంటర్నెట్ వాడే హక్కు

అన్‌లైన్ భద్రత పేరుతో ఇంటర్నెట్‌కు దూరం చేయొద్దు

వయసుతో సంబంధం లేకుండా పిల్లలకూ డిజిటల్ ప్రపంచంలో భాగస్వామ్యం

భావప్రకటన స్వేచ్ఛలో ఇంటర్నెట్ వినియోగానికీ ప్రాధాన్యం

సామాజిక మాధ్యమ సంస్థల వైఫల్యాలకు పిల్లలను బాధ్యులను చేయలేం

పిల్లల భద్రతకు ప్రత్యేక చైల్డ్ మోడ్‌పై సుప్రీంకోర్టు సూచన



4

నేటి నుంచి వర్ష సూచన

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



2

మూడు దశల్లో సమగ్ర భూ రీ సర్వే

- 285 గ్రామాల్లో సర్వే పూర్తి
- అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ
- రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి పాంగులేటి

3



నిరసనల్లో లైంగిక వేధింపులా?



4



ఆడబిడ్డల జీవితాల్లో ఆనందాల పూలవాన కురవాలి!

ప్రజలకు సద్దుల బతుకమ్మ సీఎం శుభాకాంక్షలు

ఆడబిడ్డల సంక్షేమమే అసలైన బతుకమ్మ స్ఫూర్తి: కేసీఆర్

సామాజిక న్యాయం, మహిళల ఐక్యతకు ప్రతీక: భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 17 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీ కగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి ఆడ బిడ్డలకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. 9 రోజులపాటు తీరొక్క పూలతో బతు కమ్మలను పేర్చి ఆటపాటలతో నిర్వహించుకునే ఈ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభ వానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రకృతి ఆరాధన, మహిళల ఐక్యత, సామా జిక సామరస్యం, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని అభివర్ణిం చారు. సద్దుల బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాలను నింపాలని, కుటుంబాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సద్దుల బతుకమ్మ పం డుగ సందర్భంగా తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. ప్రకృతి ని, పూలను పూజించే అరుదైన సంస్కృతికి తెలంగాణ నెలవని తెలిపారు. ప్రకృతి పట్ల ఆరాధనాభావాన్ని, మహిళల ఐక్యతను, సాంస్కృతిక వారసత్వాన్ని ఈ పండుగ ప్రతిబిం బిస్తుందని వివరించారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాల పూలవాన కురిపిం చాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని, తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాలపాటు నిలవాలని కోరుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సామాజిక న్యాయం, సమానత్వం, మహిళల ఐక్యతకు ప్రతిరూపమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ముగింపు వేడుక అయిన సద్దుల బతుకమ్మ సందర్భంగా రాష్ట్ర ఆడబిడ్డలకు బీఆర్ఎస్ అధినేత, తొలి సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజులపాటు ఆడబిడ్డల ఆటపాటలతో సాగిన బతుకమ్మ సంబురాలు రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణాన్ని సృష్టించాయని పేర్కొన్నారు. తెలంగాణ మహిళల సాంస్కృతిక చైతన్యానికి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ గొప్ప ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. 'మల్లారావమ్మా బతుకమ్మా.. మా బతుకులు బాగు చేయవమ్మా' అని కోరుకుంటూ బతుకమ్మకు వీడ్కోలు పలికే సద్దుల బతుకమ్మ వేడుక తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతుందని కేసీఆర్ పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని వివరించారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారి అభ్యున్నతికి కృషి చేసినప్పుడే బతుకమ్మ పండుగకు నిజమైన సార్థకత చేకూరుతుందని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

నేడు ట్యాంక్‌బండ్‌పై పెద్ద బతుకమ్మ వేడుకలు

మహిళలంతా వేడుకల్లో పాల్గొనాలి

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



హైదరాబాద్, అక్టోబర్ 17 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించు కుంటున్నామని పంచా యతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆలోచనల మే-రకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పెద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలని మహిళలందరికీ ఆమె ఆహ్వానం పలికారు. ఆడపడుచులందరికీ పేరుపేరునా సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది ఒక పండుగేకాక తెలంగాణ ప్రాంత అస్తిత్వాన్ని, ప్రజల జీవన విధానాన్ని, తరతరాలుగా కొనసాగుతున్న వారసత్వ సంపదను చాటిచెప్పే అరుదైన సాంస్కృతిక వేడుక అని అన్నారు. పూలతో చెరువులను శుద్ధి చేసుకుంటూ, ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే పండుగ బతుకమ్మ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సాధారణంగా పూలతో దేవుళ్లను పూజిస్తామని, కానీ పూలనే దేవతలుగా భావించి పూజించే ప్రత్యేకమైన సంప్రదాయం బతుకమ్మ పండుగలో కనిపిస్తుందని వివరించారు. నవధాన్యాలను ప్రసాదాలుగా పంచుకుంటూ ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే సంప్రదాయం ఈ పండుగలో అంతర్భాగమన్నారు. ఆత్మీయత, అనురాగాలను కలబోసుకుని, కష్టసుఖాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ మహిళలంతా కలిసిమెలిసి జరుపుకునే పండుగ బతుకమ్మ అని సీతక్క తెలిపారు. ఈ వేడుక మహిళల్లో ఐక్యతను, ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుందన్నారు. తరతరాలుగా మహిళలు తమ సంస్కృతిని, సంప్రదాయాలను తరువాతి తరాలకు అందిస్తున్నారని, బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ప్రత్యేకతకు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. తొమ్మిది రోజులపాటు సాగే ఈ వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మను ఆదివారం ఘనంగా జరుపుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పెద్ద బతుకమ్మ వేడుకలకు హైదరాబాద్‌లోని మహిళలందరూ తరలిరావాలని, పూల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆహ్వానించారు. మీ సీతక్కగా మీ అందరినీ బతుకమ్మ వేడుకలకు ఆహ్వానిస్తున్నాను.. తెలంగాణ ఆడపడుచులందరికీ స్వాగతం.. సుస్వాగతం అని అన్నారు.

పండుగ పిలుపు.. పల్లెబాట పట్టిన పట్నం!

- దసరా వేళ సొంతూళ్లకు నగరవాసుల పరుగులు
- కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లు
- రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులతో ఏర్పాట్లు
- నగర శివార్ల నుంచే జిల్లాలకు ప్రత్యేక సర్వీసులు
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం
- రద్దీ నియంత్రణకు ప్రత్యేక బృందాలు..
- ప్రయాణికుల భద్రతపై దృష్టి



హైదరాబాద్, అక్టోబర్ 17 : దసరా పండుగ సందడి మొదలైంది. పట్నం పల్లెబాట పట్టింది. ఏడాదంతా ఉ ద్యోగాలు, వ్యాపారాలు, చదువులతో నగరంలో గడిపిన జనం సొంతూళ్లకు పయనమవుతున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకోవాలన్న ఉత్సాహంతో భాగ్యనగరం నుంచి వేలాది మంది తరలివెళ్తున్నారు. దీంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. మహాత్మా గాంధీ బస్ స్టేషన్, జూబ్లీ బస్ స్టేషన్‌లలో ఎటుచూసినా ప్రయాణికుల సందడే కనిపిస్తోంది. చేతుల్లో ప్రయాణ సంచులు, వెంట పిల్లాపాపలతో బస్సుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలతో బస్టాండ్లు కళకళలాడుతున్నాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. దసరా సెలవులు రావడంతో ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో సొంత గ్రామాలకు బయలుదేరుతున్నారు. దీంతో ఎంజీబీఎస్, జేబీఎస్‌లలో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగింది. బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులతో ప్లాట్‌ఫారాలు, నిరీక్షణ గదులు నిండిపోతున్నాయి. కుటుంబాలతో ప్రయాణించే వారు ఎక్కువగా ఉండటంతో బస్టాండ్లలో సందడి నెలకొంది. రద్దీని నియంత్రించడం ఆర్టీసీ అధికారులకు సవాలుగా మారింది. రానున్న రెండు రోజుల్లో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. పండుగ సందర్భంగా ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. తెలంగాణలోని వివిధ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రకు వెళ్లే మార్గాల్లోనూ అదనపు సర్వీసులను అందుబాటులో ఉంచింది. ప్రయాణికులు బస్టాండ్లలో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తకుండా రద్దీకి అనుగుణంగా బస్సులను పంపించేలా చర్యలు చేపట్టింది. బస్సుల రాకపోకలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను నియమించింది. ప్రయాణికులకు అవసరమైన సమాచారం అందించేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచింది. ప్రధాన బస్టాండ్ల వద్ద రద్దీని తగ్గించడంతోపాటు నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. విజయవాడ, సూర్యాపేట, ఖమ్మం వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ఎల్బీనగర్, ఉప్పల్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతోంది. బెంగళూరు, కర్నూలు, మహబూబ్‌నగర్ మార్గాల్లో వెళ్లేవారికి ఆరాంఘర్ నుంచి సర్వీసులు అందుబాటులో ఉంచింది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ వైపు వెళ్లే ప్రయాణికుల కోసం జేబీఎస్, బోయిన్‌పల్లి ప్రాంతాల్లో బస్సులు ఏర్పాటు చేసింది. దీంతో నగరంలోని ప్రధాన బస్టాండ్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ప్రయాణికులు తమకు సమీపంలోని ప్రాంతాల నుంచి సొంతూళ్లకు బయలుదేరే అవకాశం కలిగింది. నగరంలోని ఐటీ కారిడార్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు పండుగకు సొంతూళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో ప్రత్యేక బస్సులు ఎక్కే కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా ప్రాంతాల్లో నివసించే ఉద్యోగులు నగరం మధ్యలోని బస్టాండ్లకు వెళ్లకుండా నేరుగా తమ ప్రాంతాల నుంచే ప్రయాణం ప్రారంభించేలా ఏర్పాట్లు చేసింది. ఈ చర్యలతో ప్రధాన బస్టాండ్లపై ప్రయాణికుల ఒత్తిడి తగ్గడంతోపాటు నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు అవకాశం ఏర్పడింది. దసరా పండుగ ప్రయాణాల్లో మహిళలకు మహాలక్ష్మి పథకం ఆర్థికంగా ఉపశమనం కలిగిస్తోంది. పథకం నిబంధనల ప్రకారం అర్హులైన మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యం పర్తించే బస్సుల్లో ప్రయాణించవచ్చు. ప్రత్యేక సర్వీసుల్లోనూ పథకం వర్తించే బస్సుల్లో అర్హతకు సంబంధించిన గుర్తింపు కార్డులను చూపించి ఉచిత ప్రయాణ టికెట్లు పొందేలా కండక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. పండుగ వేళ కుటుంబాలతో కలిసి సొంత గ్రామాలకు వెళ్లే మహిళలకు ఈ సదుపాయం ప్రయాణ ఖర్చులను తగ్గిస్తోంది. పండుగ రద్దీ నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బస్టాండ్లలో ప్రయాణికులకు మార్గనిర్దేశం చేసేందుకు సిబ్బందిని నియమించారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బస్సుల రాకపోకలను సమన్వయం చేస్తూ ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరానికి అనుగుణంగా అదనపు సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దసరా పండుగను సొంత గ్రామాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి జరుపుకోవాలన్న ఉత్సాహం నగరవాసుల్లో కనిపిస్తోంది. పల్లెల్లో పండుగ సందడి మొదలవుతుండగా, నగరంలోని బస్టాండ్లు ప్రయాణికుల రాకపోకలతో కళకళలాడుతున్నాయి. ఉద్యోగాలు, చదువుల కోసం నగరానికి వచ్చినవారు కొద్దిరోజులైనా తమవారితో గడిపేందుకు సొంతూళ్లకు బయలుదేరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచుతూ పండుగ ప్రయాణాలు సజావుగా సాగేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

దాండియా సంబరాల్లో మృత్యుఘోష!

- వేడుకల వేళ విద్యార్థులపై కుప్పకూలిన భారీ లైటింగ్ స్టాండ్
- ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో తీవ్ర విషాదం
- వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ దుర్మరణం
- మరో 25 మందికి గాయాలు.. ఐదుగురి పరిస్థితి విషమం
- ఈదురుగాలుల ధాటికి లైటింగ్ క్రేన్ కూలినట్లు ప్రాథమిక సమాచారం
- ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి



హైదరాబాద్, అక్టోబర్ 18 : అప్పటివరకు ఆటపాటలతో సందడిగా సాగిన దాండియా వేడుకల్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. విద్యార్థుల కేరింతలతో మార్మోగిన కళాశాల ప్రాంగణం క్షణాల్లోనే ఆర్తనాదాలతో నిండిపోయింది. హైదరాబాద్ శివారులోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోగా, సుమారు 25 మంది విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కళాశాలలో నిర్వహిస్తున్న 'సంగమం--2026' సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల సమయంలో భారీ ఇనుప లైటింగ్ స్టాండ్ ఒక్కసారిగా విద్యార్థులపై కుప్పకూలింది. ఈ ఘటనలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ మృతి చెందింది. ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సమగ్ర విచారణకు ఆదేశించారు. ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 'సంగమం--2026' పేరుతో సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి దాండియా వేడుకలు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంగీతం, నృత్యాలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. అయితే వేడుకలు కొనసాగుతున్న సమయంలో భారీ ఇనుప లైటింగ్ స్టాండ్ ఒక్కసారిగా అదుపుతప్పి విద్యార్థులపై కూలిపోయింది. ఊహించని ఈ ఘటనతో అక్కడున్నవారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు విద్యార్థులు పరుగులు తీయడంతో ప్రాంగణంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థిని ఇలా అకస్మాత్తుగా మృతి చెందడం తోటి విద్యార్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రమాదంలో మరో 25 మంది విద్యార్థులు గాయపడినట్లు తెలుస్తోంది. వీరిలో మృతురాలి సోదరితోపాటు ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కళాశాల సిబ్బంది, విద్యార్థులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అత్యవసర వైద్య చికిత్స కోసం ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రితోపాటు ఆదిభట్ల ప్రాంతంలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటన సమాచారం తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లల పరిస్థితి తెలుసుకునేందుకు ఆసుపత్రులను సంప్రదిస్తున్నారు. భారీ ఈదురుగాలుల కారణంగా వేడుకల కోసం ఏర్పాటు చేసిన లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. స్టాండ్ కూలిన సమయంలో మంటలు కూడా చెలరేగినట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. అయితే లైటింగ్ స్టాండ్ ఏర్పాటు చేసిన విధానం, దాని భద్రతా ప్రమాణాలు, విద్యుత్ సరఫరా వ్యవస్థ, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈదురుగాలుల ప్రభావంతోనే ప్రమాదం జరిగిందా, లేక ఏర్పాట్లలో ఏదైనా నిర్లక్ష్యం ఉందా అన్నది విచారణలో తేలనుంది. ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థిని సోనీ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పూర్తిస్థాయి విచారణ జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వేడుకల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు పాటించారా, భారీ లైటింగ్ ఏర్పాట్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకున్నారా అన్న అంశాలను పరిశీలించాలని సూచించారు. నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రమాదానికి గల వాస్తవ కారణాలను గుర్తించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్నేహితులతో కలిసి ఉత్సాహంగా గడపాల్సిన సాంస్కృతిక వేడుక ఓ విద్యార్థిని ప్రాణాలను బలిగొనడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మరో 25 మంది గాయపడటం, వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం రావడంతో కళాశాల వర్గాల్లో ఆందోళన నెలకొంది. భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనే కార్యక్రమాల్లో భద్రతా ఏర్పాట్ల ప్రాధాన్యాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

నేటి నుంచి వర్ష సూచన

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబర్ 17 : తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. అక్టోబర్ 18 హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.





సివిల్ సర్వీసెస్ అధికారుల హెరిటేజ్ వాక్

నిర్వహించిన పర్యాటక, వారసత్వ శాఖ

హైదరాబాద్, అక్టోబర్ 17: శిక్షణలో ఉన్న సుమారు 170 మంది సివిల్ సర్వీసెస్ అధికారుల కోసం రాష్ట్ర పర్యాటక, వారసత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వారసత్వ పర్యటన శనివారం నిర్వహించారు. ఈ వాక్ చారిత్రక కట్టడం చార్మినార్ వద్ద ప్రారంభమై ప్రసిద్ధ చారిత్రక భవనం చౌమహల్లా ప్యాలెస్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా అధికారులకు హైదరాబాద్ నగర చరిత్ర, విశిష్ట నిర్మాణ శైలి, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకునే అవకాశం కలిగింది. హైదరాబాద్ నగర సాంస్కృతిక గుర్తింపులో ఈ చారిత్రక కట్టడాల ప్రాధాన్యతను, వాటి చారిత్రక నేపథ్యాన్ని శిక్షణలో ఉన్న అధికారులకు పరిచయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలోని చారిత్రక, సాంస్కృతిక సంపదపై అవగాహన కల్పించడంతో పాటు, రాష్ట్ర పర్యాటక ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు శాఖ చేపడుతున్న కార్యక్రమాల్లో ఈ పర్యటన ఒక భాగం.

ఖేలో తెలంగాణ బంధన్‌కు పెరుగుతున్న ఆదరణ

ప్రజలు, క్రీడాకారుల నుంచి విశేష స్పందన

ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 17 : రాష్ట్ర క్రీడా శాఖ చేపట్టిన ఖేలో తెలంగాణ బంధన్ కార్యక్రమానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని, ప్రజలు, క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభిస్తోందని ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన ఖేలో తెలంగాణ ఫిట్‌నెస్ ఛాలెంజ్‌లో పాల్గొన్న ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, కేంద్ర క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సోనిబాలాదేవి, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులకు ఫిట్‌నెస్ ఛాలెంజ్ విసిరారు. చిన్నా పెద్దా తేడా లేకుండా, వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడలను తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలని జితేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, పరుగు, యోగా వంటి శారీరక దృఢత్వ కార్యకలాపాలను అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని సొంతం చేసుకోవచ్చన్నారు. గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యతతో సమాజంలో క్రీడల పట్ల సానుకూల వాతావరణం ఏర్పడుతోందన్నారు. ప్రజలను ఆరోగ్యం, ఫిట్‌నెస్ దిశగా ప్రోత్సహించడంతోపాటు క్రీడా స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలో పెంపొందించేందుకు ఖేలో తెలంగాణ బంధన్ దోహదపడుతుందని తెలిపారు. ఖేలో తెలంగాణ కార్యక్రమం నిరంతర ఉద్యమంలా కొనసాగాలని, ప్రజల భాగస్వామ్యంతో ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జితేందర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో తీవ్ర కరవు

- 315 మండలాల్లో కరవు ఛాయలు: తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్రంలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నట్టు గుర్తింపు
- కేంద్రం తక్షణమే సాయం చేయాలని కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్రవ్యాప్తంగా 23 శాతం వర్షపాత లోటు, 13 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు
- పంట నష్టపోయిన రైతులకు రూ.1,986 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రతిపాదన
- ప్రమాదకరంగా పడిపోయిన జలాశయాల నీటిమట్టాలు



హైదరాబాద్, అక్టోబర్ 18: తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గడంతో 315 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని తక్షణమే ఆదుకోవాలని, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్), మధ్యంతర పంట విత్తనాల పంపిణీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మద్దతు ధరతో మొక్కజొన్న, జొన్న తదితర పంటలను 100 శాతం కొనుగోలు చేయాలని, ధరల మద్దతు పథకం కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించడంతో పాటు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అనధికారిక క్యాబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని, వాటిలో 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 మండలాల్లో ఓ మోస్తరు కరవు నెలకొందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు రూ. 1,986.89 కోట్లతో కూడిన సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. గణాంకాల ప్రకారం, జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య రాష్ట్రంలో సాధారణంగా 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అక్టోబర్ 15 నాటికి ఈ వర్షపాత లోటు 23 శాతానికి చేరింది. దీని ప్రభావంతో గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం 13.22 లక్షల ఎకరాలు తగ్గి, 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు, రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. 466 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 209.45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, సాగునీటి విడుదలను పరిమితం చేయాలని అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కరవును అధికారికంగా ప్రకటించి, కేంద్రం నుంచి గరిష్ఠంగా సాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది.

గోదావరి-కావేరి లింక్‌తో రాష్ట్రానికి మరణ శాసనం

- బాబు కుట్రకు రేవంత్ మద్దతు
- తెలంగాణ ద్రోహులు మళ్లీ నిద్ర లేచారు
- తెలంగాణ నోట్లో మట్టికొడుతున్న 'చెయ్యి'!
- తెలంగాణ గొంతు కోస్తున్న బాబు
- దేవాదులలో మోటర్లు ఎందుకు నడపలేదు?
- మీ నిర్వాకం వల్ల వరంగల్ జిల్లా కరువు పాలైంది
- బీజేపీ నాయకులు ఏం చేస్తున్నరు?
- నిప్పులు చెరిగిన హరీష్ రావు



హైదరాబాద్, అక్టోబర్ 17: నవంబర్ 3న దిల్లీలో జరగనున్న ఎన్‌డబ్ల్యుడీఏ మీటింగ్ ఎజెండాలో గోదావరి-కావేరి లింకును చేరుస్తూ రాష్ట్ర నీటి హక్కులకు మరణశాసనం రాస్తున్నారని, అడ్డుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కుట్రకు మద్దతు పలుకుతూ చారిత్రక ద్రోహానికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వెలిబుచ్చారు. తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి-కావేరి లింకును పోలవరం నుంచి చేపట్టాలని, ఎజెండాలో చేర్చాలని ఏపీ సీఎం చంద్రబాబు ఈనెల 7న లేఖ రాయగానే, వెంటనే ఎజెండాలో పొందుపరిచి నవంబర్ 3న మీటింగ్ పెట్టారని హరీశ్ రావు మండిపడ్డారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం కుక్కిన పేనులా పడి ఉన్న తెలంగాణ ద్రోహులంతా ఇవాళ మళ్లీ నిద్రలేచారని విమర్శించారు. పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టుతో గోదావరి జలాలను అక్రమంగా ఏపీకి తరలించేందుకు విష కూటమిలా తయారయ్యారని ఆరోపించారు. తెలంగాణలో రేవంత్ సర్కార్ ఏర్పడిన మరుక్షణం నుంచే చంద్రబాబు గోదావరి జలాల దోపిడీ మొదలుపెట్టారని, రాష్ట్ర ప్రభుత్వ మొద్దునిద్ర కారణంగా బాబు ఎత్తులు అమలువుతున్నాయని అన్నారు. గోదావరిలో 200 టీఎంసీలు తరలించేందుకు మొదట పోలవరం-బనకచర్ల తెచ్చారని, ఆ తర్వాత నల్లమలసాగర్‌గా మార్చారని, ఇప్పుడు కేంద్రంతో ఒప్పించి గోదావరి-కావేరి నదుల అనుసంధానం పేరిట బనకచర్లకు మార్గం సుగమం చేసుకుంటున్నారని హరీశ్ రావు దుయ్యబట్టారు. చంద్రబాబు ఇప్పుడు గోదావరి-కావేరి ముసుగులో నేరుగా పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జున సాగర్ సోమశిల ద్వారా కావేరికి నీళ్లు తరలించే ప్లాన్ చేశారని తెలిపారు. కేసీఆర్ హెచ్చరించినట్టుగా 'కత్తి పరాయి వాడిదే కానీ.. పొడిచే చెయ్యి మనోడిదే' అన్నట్లుగా రేవంత్ రెడ్డి తెలంగాణ నోట్లో మట్టికొడుతున్నాడని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇది ముమ్మాటికీ జాతి ద్రోహమని, నువ్వు చేస్తున్న జల ద్రోహానికి భవిష్యత్ తరాలు కూడా క్షమించవని సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో తాము అనేకసార్లు హెచ్చరించినా పట్టించుకోలేదన్నారు. దేవాదులలో నీళ్లు వస్తున్నా పది మోటార్లు నడవాల్సిన చోట మూడే ఎందుకు నడుపుతున్నావని నిలదీశారు. దేవాదులలో పూర్తిస్థాయిలో మోటార్లు నడిపి ఉంటే వరంగల్‌లో కరువు వచ్చేది కాదని, ఏపీలో కరువు లేకున్నా తెలంగాణలో మాత్రం పంటలు వేయొద్దంటున్నారని ఆక్షేపించారు. మ్యాప్‌లు పరిశీలించాలని హరీశ్ రావు హితవు పలకగా, చంద్రబాబు లేఖ రాసి పది రోజులు అవుతున్నా రేవంత్ రెడ్డి పెదవి విప్పకపోవడం వెనుక ఉన్న ఒప్పందమేంటని నిలదీశారు. బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కూడా తెలంగాణ హక్కులను కాపాడే బాధ్యత విస్మరించారని విమర్శించారు. తెలంగాణ జాతికి మోసం చేస్తే ప్రజలు ఊరుకోరని, ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు గంద్ర వెంకటరమణ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడు దశల్లో సమగ్ర భూ రీ సర్వే

- 285 గ్రామాల్లో సర్వే పూర్తి
- అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు
- నవంబర్ చివరినాటికి మొదటి దశ పూర్తికి సన్నాహాలు
- పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ
- రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, అక్టోబర్ 18 : భూ సమస్యలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి భూ యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీ సర్వేను మూడు దశల్లో పూర్తి చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూ సర్వే పురోగతిపై సచివాలయంలో రెవెన్యూ అధికారులతో శనివారం నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 285 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసి భూ యజమానుల నుంచి అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రస్తుతం ఉన్న 411 రోవర్లకు అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని వివరించారు. ప్రజల సంతృప్తే ప్రాధాన్యంగా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలకు గాను తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకుని మొత్తం 2,720 గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుకు భూమి ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ యాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకురావడంతో పాటు తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపడంలో సమగ్ర రీ సర్వే కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారాలుగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, సర్వే నంబర్ల ఉప విభాగాలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దుల్లో మార్పులు చోటుచేసుకోవడం వంటి కారణాలతో భూముల అసలు హద్దులపై స్పష్టత కొరవడిందని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 2 కోట్ల 29 లక్షలకు పెరిగిందని వివరించారు. సంప్రదాయ పరికరాలకు స్వస్తి పలుకుతూ డీజీపీఎస్, రోవర్లు, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని, వీటి ద్వారా వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా భూదార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో ఉన్న మొత్తం 665 ఎకరాల్లో పంద శాతం రీ సర్వేను విజయవంతంగా పూర్తిచేశామని, త్వరలో భూదార్ పట్టాలు పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు వెళ్లే ముందు సంబంధిత పట్టాదారులకు విధిగా ముందస్తు నోటీసులు ఇవ్వాలని, సర్వేకు ఒకటి రెండు రోజుల ముందు ఆయా గ్రామాల్లో తప్పనిసరిగా చాటింపు వేయాలని సూచించారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూములకు స్పష్టమైన మార్కింగ్ చేయాలని, గ్రామకంఠం హద్దులను నిర్ధారించిన తర్వాతే సర్వే చేపట్టి అభ్యంతరాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భూ రీ సర్వేను అధికారులు ప్రభుత్వ విధిగా భావించకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అత్యంత కీలక బాధ్యతగా గుర్తించాలని పొంగులేటి సూచించారు.



రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం సాధించాలి

బీజేపీ చీఫ్ రామచందర్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 17 : రాబోయే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై కీలక సన్నాహక సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, మల్క కొమురయ్యలతోపాటు రెండు ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ముఖ్య నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ గతంలో హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని దివంగత నేత వి.రామారావు పలుమార్లు గెలుచుకున్నారని, ఇతర స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులు ఘన విజయం సాధించిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. అభ్యర్థులు ఎవరనే దానితో సంబంధం లేకుండా పార్టీ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడితో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ఓటరు నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యావంతులను ఓటర్లుగా నమోదు చేయించడంతోపాటు, పోలింగ్ రోజున వారు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో కార్యకర్తలు చొరవ చూపాలని కోరారు. బీజేపీ పట్ల విద్యావంతులు, గ్రాడ్యుయేట్లలో బలమైన సానుకూలత ఉందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఇదే సమయంలో దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా సాగుతున్న 'వోట్ చోరీ' ప్రచారం వెనుక విదేశీ శక్తుల ప్రమేయం దాగి ఉందని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పార్టీ నేతలు, కార్యకర్తలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో తగిన సమయం కేటాయించి పార్టీని విజయ తీరాలకు చేర్చాలని రామచందర్ రావు పిలుపునిచ్చారు.

సంపాదకీయం



మరోసారి భగ్గుమన్న ఫ్రాన్స్!

విద్యారంగ సంస్కరణల కోసం దేశవ్యాప్తంగా ఆందోళనలు

పారిస్‌లో కారుకు, దుకాణానికి నిప్పు..

లియోన్‌లోనూ హింసాత్మక ఘటనలు

విద్యారంగంలో సమూల సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఫ్రాన్స్‌లో కొనసాగుతున్న ఆందోళనలు మరోసారి హింసాత్మకంగా మారాయి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల నియామకాలు, విద్యారంగానికి నిధుల కేటాయింపులపై విద్యార్థులు, నిరసనకారులు చేపట్టిన ఆందోళనలు పలు నగరాల్లో ఉద్రిక్తతలకు దారితీశాయి. రాజధాని పారిస్‌తోపాటు లియోన్, మార్సెయిల్ నగరాల్లో విధ్వంసకర ఘటనలు చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులను ప్రయోగించారు. హింసాత్మక ఘటనలకు సంబంధించి దేశవ్యాప్తంగా 166 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

పారిస్‌లో కారుకు, దుకాణానికి నిప్పు

ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని నగర కేంద్రానికి సమీపంలో ఆందోళనలు ఉద్రిక్తంగా మారాయి. నిరసనల సందర్భంగా కొందరు ఆందోళనకారులు ఒక కారుతోపాటు దుకాణానికి నిప్పంటించినట్లు సమాచారం. దీంతో పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులను ప్రయోగించారు. నిరసనల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సాధారణ జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.

లియోన్‌లో పర్యాటక కార్యాలయానికి నిప్పు

ఫ్రాన్స్‌లోని ప్రధాన నగరాల్లో ఒకటైన లియోన్‌లోనూ హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆందోళనల సందర్భంగా ఓ పర్యాటక కార్యాలయానికి నిప్పంటించినట్లు సమాచారం. మరోవైపు మార్సెయిల్ నగరంలో నిరసనకారులు ఓ పోలీస్ స్టేషన్‌తోపాటు పలు దుకాణాలను ధ్వంసం చేసినట్లు వెల్లడైంది. వరుస ఘటనలతో పలు నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. హింసాత్మక ఘటనలకు పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఫ్రాన్స్‌లో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొన్ని రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. పాఠశాలల్లో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం, ఉపాధ్యాయ సిబ్బంది కొరత, విద్యారంగానికి తగినన్ని నిధులు కేటాయించకపోవడం, పాఠశాల భవనాలు అధ్వానంగా ఉండటం వంటి సమస్యలను నిరసనకారులు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల విద్యతోపాటు విశ్వవిద్యాలయాల ప్రవేశాల వ్యవస్థపైనా విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రవేశాల ప్రక్రియ సంక్లిష్టంగా ఉందని, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని కోరుతూ ఆందోళనల్లో పాల్గొంటున్నారు. ఈ నిరసనలకు కార్మిక సంఘాలు కూడా మద్దతు ప్రకటించినట్లు సమాచారం. దీంతో విద్యారంగ సమస్యలపై ప్రారంభమైన ఆందోళనలు విస్తృత స్థాయికి చేరుకున్నాయి.

166 మంది అరెస్టు.. కొనసాగుతున్న ఉద్రిక్తత

పలు నగరాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడంతో పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. విధ్వంసానికి పాల్పడినట్లు అనుమానిస్తున్న 166 మందిని దేశవ్యాప్తంగా అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల వందలాది పాఠశాలలకు నిప్పంటించినట్లు కూడా కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ ఘటనల పూర్తి వివరాలు, నష్టం తీవ్రతపై అధికారిక నిర్ధారణ అవసరం. విద్యారంగ సంస్కరణల కోసం కొనసాగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారుతుండటంతో ఫ్రాన్స్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి.



పిల్లలకూ ఇంటర్నెట్ వాడే హక్కు

నిషేధం పరిష్కారం కాదు!

ఆన్‌లైన్ భద్రత పేరుతో ఇంటర్నెట్‌కు దూరం చేయొద్దు

- వయసుతో సంబంధం లేకుండా పిల్లలకూ డిజిటల్ ప్రపంచంలో భాగస్వామ్యం
- భావప్రకటన స్వేచ్ఛలో ఇంటర్నెట్ వినియోగానికీ ప్రాధాన్యం
- సామాజిక మాధ్యమ సంస్థల వైఫల్యాలకు పిల్లలను బాధ్యులను చేయలేం
- పిల్లల భద్రతకు ప్రత్యేక చైల్డ్ మోడ్‌పై సుప్రీంకోర్టు సూచన



న్యూఢిల్లీ, అక్టోబర్ 17 : పిల్లల ఆన్‌లైన్ భద్రత పేరుతో వారికి ఇంటర్నెట్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం సరైన పరిష్కారం కాదని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లలకు కూడా వయసుతో సంబంధం లేకుండా ఇంటర్నెట్ ద్వారా సమాచారం పొందే, అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశాలు ఉండాలని స్పష్టం చేసింది. డిజిటల్ ప్రపంచంలో పిల్లల భాగస్వామ్యాన్ని అడ్డుకోవడం కంటే వారిని ఆన్‌లైన్ ప్రమాదాల నుంచి రక్షించేందుకు సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం ముఖ్యమని అభిప్రాయపడింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు ఇంటర్నెట్ వినియోగంతో సన్నిహిత సంబంధం ఉందని ధర్మాసనం పేర్కొంది. సమాచారాన్ని తెలుసుకోవడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, ఇతరులతో ఆలోచనలను పంచుకోవడం వంటి అవకాశాలను ఇంటర్నెట్ విస్తృతం చేసిందని వివరించింది. డిజిటల్ సాంకేతికత నిత్యజీవితంలో కీలకంగా మారిన నేపథ్యంలో పిల్లలను పూర్తిగా ఇంటర్నెట్‌కు దూరం చేయడం వారి విద్యా, సమాచార అవకాశాలపై ప్రభావం చూపుతుందని అభిప్రాయపడింది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో నివసించే పిల్లలకు విద్యా సంబంధిత సమాచారం, అభ్యాస వనరులు అందించడంలో ఇంటర్నెట్ కీలక పాత్ర పోషిస్తోందని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. పాఠశాలలు, గ్రంథాలయాలు, ఇతర విద్యా సౌకర్యాలు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో డిజిటల్ వేదికలు పిల్లలకు ఉపయోగపడుతున్నాయని పేర్కొంది. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు తమలాంటి పరిస్థితుల్లో ఉన్నవారితో పరిచయాలు పెంచుకోవడానికి, అనుభవాలను పంచుకోవడానికి, సామాజికంగా అనుసంధానం కావడానికి కూడా ఇంటర్నెట్ దోహదపడుతుందని వివరించింది. సామాజిక మాధ్యమాల్లో హానికరమైన సమాచారం, అనుచిత దృశ్యాలు, ప్రమాదకరమైన అంశాలు పిల్లలకు అందుబాటులోకి రావడంపై ఆందోళనలు సహజమేనని ధర్మాసనం పేర్కొంది. అయితే అలాంటి సమాచారాన్ని గుర్తించి తొలగించడంలో సామాజిక మాధ్యమ సంస్థలు విఫలమైతే అందుకు పిల్లలను బాధ్యులుగా చూడటం సరికాదని అభిప్రాయపడింది. ఆన్‌లైన్ వేదికలను సురక్షితంగా నిర్వహించాల్సిన బాధ్యత ఆయా సంస్థలపై కూడా ఉంటుందని స్పష్టం చేసింది.

చైల్డ్ మోడ్‌తో రక్షణకు అవకాశం

పిల్లల ఇంటర్నెట్ వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించడం కంటే వయసుకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయడం అవసరమని సుప్రీంకోర్టు సూచించింది. సామాజిక మాధ్యమ ఖాతాల్లో ప్రత్యేకంగా 'చైల్డ్ మోడ్' ప్రవేశపెట్టే అవకాశాన్ని పరిశీలించాలని ప్రస్తావించింది. పిల్లలకు హానికరమైన సమాచారం చేరకుండా నిరోధించడం, వారి వ్యక్తిగత వివరాలకు రక్షణ కల్పించడం, వయసుకు తగిన అంశాలనే అందుబాటులో ఉంచడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించింది. డిజిటల్ యుగంలో పిల్లల విద్య, సమాచార అవసరాలను గుర్తించడంతోపాటు వారి భద్రతను కూడా పరిరక్షించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం వ్యాఖ్యల సారాంశం స్పష్టం చేస్తోంది. పిల్లలకు ఇంటర్నెట్ అందుబాటును పూర్తిగా నిరాకరించకుండా తగిన నియంత్రణలు, రక్షణ చర్యలతో సురక్షిత వినియోగాన్ని ప్రోత్సహించాలనే అంశం ఈ వ్యాఖ్యల్లో ప్రధానంగా నిలిచింది.

నిరసనల్లో మహిళలపై లైంగిక వేధింపులా?

- ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయానికి మహిళా సంఘాల నిరసన ర్యాలీ
- మహిళా జర్నలిస్టులనూ వేధించారంటూ ఆగ్రహం
- జూలై 20 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగిన ఘటనలపై ఫిర్యాదు
- వీడియో ఆధారాలతో పోలీసు ఉన్నతాధికారులకు వినతిపత్రం



న్యూఢిల్లీ, అక్టోబర్ 17 : ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు వచ్చిన మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు జరుగుతున్నాయంటూ ఢిల్లీలో మహిళా సంఘాలు ఆందోళనకు దిగాయి. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల సందర్భంగా మహిళల భద్రతకు ముప్పు ఏర్పడుతోందని ఆరోపించాయి. ఆందోళనల్లో పాల్గొంటున్న మహిళలతోపాటు వార్తల సేకరణకు వెళ్లిన మహిళా జర్నలిస్టులపైనా కొందరు అసభ్యంగా ప్రవర్తించారని మండిపడ్డాయి. ఈ ఘటనలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి.

దాడులను అరికట్టాలంటూ నినాదాలు

ఢిల్లీలో కొద్దిరోజులుగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, ఇండియా కూటమికి చెందిన పక్షాలతోపాటు పలు విద్యార్థి సంఘాలు ఈ నిరసనల్లో పాల్గొంటున్నాయి. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో ఆందోళనలకు హాజరవుతున్నారు. అయితే నిరసనల సందర్భంగా కొందరు మహిళలు లైంగిక వేధింపులు, భౌతిక దాడులకు గురైనట్లు మహిళా సంఘాలు ఆరోపించాయి. శాంతియుతంగా నిరసన తెలిపే మహిళలకు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శించాయి. మహిళలపై జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న వేధింపులను నిరసిస్తూ ఐద్వా, ఐప్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐఎంఎస్ఎస్, అలిఫా, ఎస్ఎఫ్ఐ తదితర సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. గురుద్వారా బంగ్లా సాహిబ్ నుంచి ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. మహిళలపై హింసను అరికట్టాలని, లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. నిరసనల్లో పాల్గొనడం ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కని, ఆ హక్కును వినియోగించుకునే మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఆందోళనలను కవర్ చేసేందుకు వెళ్లిన మహిళా జర్నలిస్టుల పట్ల కూడా కొందరు అసభ్యంగా ప్రవర్తించినట్లు మహిళా సంఘాలు ఆరోపించాయి. విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయులకు సైతం రక్షణ లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నాయి. మహిళలపై జరిగినట్లు చెబుతున్న దాడులకు సంబంధించిన కొన్ని వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్నాయని తెలిపాయి. ఆయా వీడియోలను ఆధారాలుగా చూపిస్తూ పోలీసు ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించాయి. జూలై 20 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగిన నిరసనల సందర్భంగా మహిళలపై పలు దాడులు, వేధింపులు చోటుచేసుకున్నాయని సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ ఘటనలపై ఫిర్యాదులు చేసినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో పోలీసు ఉన్నతాధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. మహిళల భద్రతకు సంబంధించిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో పాల్గొనే మహిళలకు, విధులు నిర్వహించే మహిళా జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించాలని మహిళా సంఘాలు కోరాయి. లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. మహిళలపై హింసను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశాయి. కాగా, మహిళా సంఘాలు చేసిన ఆరోపణలు, సమర్పించిన వీడియో ఆధారాలపై పోలీసుల అధికారిక స్పందన, దర్యాప్తు వివరాలు తెలియాల్సి ఉంది.

మురికి టాయిలెట్ ఫొటో పెడితే రూ.వెయ్యి రివార్డు

- వాహనదారులకు ఎన్‌హెచ్ఏఐ బంపర్ ఆఫర్
- టోల్‌ప్లాజాల్లో అపరిశుభ్ర మరుగుదొడ్లను గుర్తిస్తే బహుమతి
- రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో ఫొటో అప్‌లోడ్ చేస్తే చాలు
- ఫాస్టాగ్ రీఛార్జ్ రూపంలో రూ.వెయ్యి రివార్డు
- అక్టోబర్ 31 వరకు ప్రత్యేక కార్యక్రమం



న్యూఢిల్లీ, అక్టోబర్ 17 : జాతీయ రహదా రులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం వినూత్న అవకాశాన్ని కల్పించింది. టోల్‌ప్లాజాల్లో అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను గుర్తించి ఫొటో తీసి పంపిస్తే రూ.వెయ్యి బహుమతి పొందే అవకాశం కల్పిస్తోంది. జాతీయ రహదారులపై మౌలిక సదుపాయాలను మెరుగు పరచడంతోపాటు మరుగుదొడ్ల పరిశుభ్రతను పెంచేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'క్లీన్ టాయిలెట్ పిక్చర్ ఛాలెంజ్' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమం అక్టోబర్ 31 వరకు అందుబాటులో ఉంటుందని ప్రకటించింది. జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల్లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటే వాహనదారులు ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. మురికిగా ఉన్న మరుగుదొడ్డి ఫొటో తీసి 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసే వ్యక్తి పేరు, మరుగుదొడ్డి ఉన్న ప్రదేశం, వాహన రిజిస్ట్రేషన్ నంబర్, మొబైల్ నంబర్ తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అర్హత పొందిన ఫిర్యాదుదారులకు రూ.వెయ్యి బహుమతిని ఫాస్టాగ్ రీఛార్జ్ రూపంలో అందించనున్నట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తెలిపింది. వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా రివార్డును అందించే విధానాన్ని అమలు చేయనుంది. అయితే ఫొటో అప్‌లోడ్ చేసిన ప్రతి ఒక్కరికీ బహుమతి ఆటోమేటిక్‌గా లభించదని, ఫిర్యాదు అర్హతను పరిశీలించిన తర్వాతే రివార్డు వర్తిస్తుందని గుర్తుంచుకోవాలి. ఈ పథకానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. జాతీయ రహదారులపై టోల్‌ప్లాజాల నిర్వహణ పరిధిలో ఉన్న మరుగుదొడ్లకు మాత్రమే ఈ కార్యక్రమం వర్తిస్తుంది. పెట్రోల్ బంకులు, రహదారి పక్కన ఉన్న దాబాలు, హోటళ్లు, ఇతర ప్రైవేటు ప్రదేశాల్లోని మరుగుదొడ్ల ఫొటోలు పంపితే బహుమతి వర్తించదని సంస్థ స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణిస్తుంటారు. ప్రయాణికులకు తాగునీరు, విశ్రాంతి సదుపాయాలతోపాటు పరిశుభ్రమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉండటం అత్యవసరం. టోల్‌ప్లాజాల్లో మరుగుదొడ్ల నిర్వహణలో లోపాలను గుర్తించేందుకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వాహనదారుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించడం ద్వారా అపరిశుభ్రత సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఇకపై టోల్‌ప్లాజాల్లో మురికి మరుగుదొడ్డి కనిపిస్తే ఫొటో తీసి ఫిర్యాదు చేయడం ద్వారా పరిశుభ్రత మెరుగుదలకు సహకరించడంతోపాటు రూ.వెయ్యి రివార్డు పొందే అవకాశం కూడా ఉంది.

భక్తిశ్రద్ధలతో రుద్రారంలో దేవి శరన్నవరాత్రి యజ్ఞం

- ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుంది
- పురోహితులు రాజమనోహర్ శర్మ

దుబ్బాక ప్రతినిధి (అక్బర్ పేట-భూంపల్లి), అక్టోబర్ 17, :

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభించడంతో పాటు మనిషిలో సానుకూల దృక్పథం పెంపొందుతుందని పురోహితుడు రాజ మనోహర్ శర్మ అన్నారు. సిద్దిపేట జిల్లా అక్బర్ పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వాహకులు ప్రత్యేక యజ్ఞ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రాల నడుమ యజ్ఞ కార్యక్రమం కొనసాగగా, గ్రామానికి చెందిన పలువురు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఇదారి చంద్రకళ- కనకయ్య దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ సందర్భంగా పురోహితుడు రాజ మనోహర్ శర్మ మాట్లాడుతూ నిత్యజీవితంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందని, భక్తి భావంతో పాటు ఆధ్యాత్మిక విలువలు పెంపొందుతాయని సూచించారు.



అనంతరం ఉత్సవాల నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతూ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తుల సహకారంతో రానున్న రోజుల్లోనూ ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల ఐక్యతకు ప్రతీక బతుకమ్మ

ప్రముఖ చిత్రకారుడు రుస్తుం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17, :

తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సబ్బండ వర్గాల ఐక్యతకు, సహజీవన సౌందర్యానికి ప్రతిరూపమని ప్రముఖ మానవతావాది, అంతర్జాతీయ చిత్రకారుడు రుస్తుం అన్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సిద్దిపేటలోని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో రూపొందించిన 'కలసిమెలసి బతుకమ్మ' చిత్రాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రుస్తుం మాట్లాడుతూ పండుగలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు కళలు, సంస్కృతిని మరింతగా వికసింపజేస్తాయని పేర్కొన్నారు. రంగురంగుల పూలతో అలంకరించే బతుకమ్మ ప్రకృతికి పెద్దపీట వేస్తూ తెలంగాణ మహిళల ఆటపాటలతో సందడిని నింపుతుందని అన్నారు. విభిన్న వర్గాల ప్రజలు కలసిమెలసి జీవించాలనే సందేశాన్ని బతుకమ్మ చాటుతుందని, తెలంగాణ అస్తిత్వానికి ఈ పండుగ ప్రత్యేక గుర్తింపునిస్తుందని వివరించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆడపడుచులకు ముఖ్యమంత్రి చీరల కానుక అందించడం తెలంగాణ సంప్రదాయంలో భాగమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా శాంతి, సంతోషాలు వెల్లివిరిసి, ప్రజల మధ్య ఐక్యత, సహజీవనం బలపడాలని బతుకమ్మ పండుగ సందేశమిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ అధ్యక్షురాలు జులేఖా రుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీం రుస్తుం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రుబీనా రుస్తుం, రహీమ్, కొండ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.




ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17, :

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో చోటు కల్పించాలని, అనర్హుల పేర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సవరణ ప్రక్రియ పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జరగాలని స్పష్టం చేశారు. సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు, సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారుల సమన్వయంతో ఓటర్ల నుంచి సేకరించిన ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను స్వీకరించి, పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.



దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన శంభీపూర్ క్రిష్ణ

- భౌరంపేట్‌లో దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ నేత

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17, : దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ 295వ డివిజన్‌లో పలు అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి మండపాలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు శంభీపూర్ క్రిష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులతో ఆయన ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు బెంబడి బుచ్చిరెడ్డి, నాచారం మురళి యాదవ్, పాల్వనూరి విష్ణు వర్ధన్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ జీతయ్య, సీనియర్ నాయకులు ఎస్వీ సురేందర్ రెడ్డి, ఆకుల బాబు, బైండ్ల గోపాల్, నాయకులు ఏరోళ్ల జంగా రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, కుమ్మరి మల్లేష్, ప్రదీప్ రెడ్డి, సునీల్, శ్రీకాంత్‌తో పాటు పలువురు నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



దసరా మండపాల వద్ద పాలపిట్టను ప్రదర్శిస్తే కేసులు నమోదు

- పాలపిట్టను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత: అటవీ శాఖ అధికారులు

కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 17 : దసరా పండుగ సందర్భంగా మండపాల వద్ద పాలపిట్టను ప్రదర్శించవద్దని తెలంగాణ అటవీ శాఖ అధికారులు ప్రజలకు సూచించారు. పాలపిట్టను పట్టుకోవడం, బంధించడం, ప్రదర్శించడం లేదా చట్టవిరుద్ధంగా వినియోగించడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పాలపిట్ట పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అటవీ శాఖ ప్రత్యేక పోస్టర్లను రూపొందించింది. దసరా మండపాల నిర్వాహకులకు ఈ పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తూ, పక్షులను పట్టుకోవడం, బంధించడం, ప్రదర్శించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పాలపిట్ట పర్యావరణ సమతుల్యత, జీవవైవిధ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు పేర్కొన్నారు. పండుగ సంప్రదాయాల పేరుతో వన్యప్రాణులకు హాని కలిగించే చర్యలకు పాల్పడటం సరికాదని స్పష్టం చేశారు. వన్యప్రాణుల సంరక్షణ కేవలం అటవీ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. దసరా మండపాల వద్ద ఎక్కడైనా పాలపిట్టను పట్టుకున్నా, బంధించినా లేదా ప్రదర్శిస్తున్నట్లు గుర్తించినా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పక్షులను స్వేచ్ఛగా జీవించనిస్తూ, ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో శనివారం అటవీ శాఖ అధికారులు బంజారాహిల్స్ పోలీసులకు పాలపిట్ట పరిరక్షణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను అందజేశారు. పండుగ వేడుకల సమయంలో వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.



బతుకమ్మ వేడుకలకు చెరువుల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కోమటి చెరువు, ఎర్ర చెరువు, మచ్చవాని కుంటలను పరిశీలించిన అధికారులు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17, :

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు, ఎర్ర చెరువు, మచ్చవాని కుంటలను శనివారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బాలకృష్ణ, ఏసీపీ రవీందర్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ మహేందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. బతుకమ్మ వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చెరువుల పరిసరాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, ఇతర అవసరమైన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. పండుగ సందర్భంగా ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు పృథ్వి, జమీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహేష్, శివకుమార్, వార్డు అధికారులు, జవాన్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 19న ప్రజావాణి రద్దు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17, :



బతుకమ్మ, దసరా పండుగలు, మహర్నవమి ఐచ్ఛిక సెలవు నేపథ్యంలో ఈ నెల 19వ తేదీ సోమవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రజావాణి నిర్వహించ నందున ప్రజలు ఫిర్యాదులు, వినతులు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని ఆమె సూచించారు. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం కూడా రద్దు చేసినట్లు వెల్లడించారు. తదుపరి సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.<

శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ



ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శనివారం నిజాంపేట్ పరిధిలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని శ్రీ కనకదుర్గ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ ధర్మకర్త కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ నర్సింహా రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డీసీసీ సభ్యులు రావూరి మౌళేశ్వర్ రావు, డివిజన్ అధ్యక్షులు వారాగాని వాసు, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, నాయకులు టేకుల ప్రవీణ్ రెడ్డి, శ్రీశైలం, లక్ష్మణ్, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో బండి రమేష్ ప్రత్యేక పూజలు

కూకట్‌పల్లి, అక్టోబర్ 17 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ శనివారం పలు ఆలయాల్లో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖైతలాపూర్‌లోని దుర్గమ్మ తల్లి ఆలయంలో ప్రకాష్ ముదిరాజ్ ఆహ్వానం మేరకు, చిత్తరామ టెంపుల్‌లో తూము వేణు ఆహ్వానం మేరకు, బేగంపేట్‌లో రమేష్ ఆహ్వానం మేరకు నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలకు బండి రమేష్ హాజరయ్యారు. ఆయా ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సమాజంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



దుబ్బాక పేదలకు ఇంటి పట్టాల పంపిణీ

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందజేత.. మిగిలిన వారికి కూడా న్యాయం చేస్తామన్న నాయకులు..



దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 17, :
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం ఎదురుచూసిన దుబ్బాక పట్టణ పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు పట్టణంలోని అర్హులైన లబ్ధిదారులకు స్థానిక ప్రజాప్రతినిధులు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ శ్రీరామ్ సరస్వతి నరేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్, 15వ వార్డు కౌన్సిలర్ అనంతుల భాగ్యమ్మ శ్రీనివాస్, 14వ వార్డు కౌన్సిలర్ తునికి సురేష్, 20వ వార్డు కౌన్సిలర్ బరేని అఖిల సాయితేజ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం అమలులో పేదలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన వారికి న్యాయం చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, ఇంకా పట్టాలు అందని వారు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. వారి వివరాలను పరిశీలించి, విచారణ అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. పేదలకు సొంతింటి భరోసా కల్పించి, వారి జీవితాల్లో భద్రత నింపడమే ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు.

అంబేద్కర్ నగర్‌లో ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17,:
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గణేష్ నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో వీర హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దుర్గాదేవి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ మంచి జరగాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని కోరుకున్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం వీర హనుమాన్ యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కృష్ణ యాదవ్, స్థానిక యూత్



అధ్యక్షుడు నరేష్, అంబేద్కర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దిలీప్, ఉమామహేశ్వర్, నగేష్ గౌడ్, జగదీష్, నరసింహ, బాలరాజు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్టలో ఘనంగా శ్రీ దుర్గా భవాని అమ్మవారి పూజా కార్యక్రమం

- ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీజేపీ యువ నాయకులు ఆర్థిక్ యాదవ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17, : జగద్గిరిగుట్టలోని దుర్గా భవాని అసోసియేషన్ సభ్యులు చిన్న, దేవేందర్ ఆధ్వర్యంలో శనివారం శ్రీ దుర్గా భవాని అమ్మవారి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీజేపీ యువ నాయకులు ఆర్థిక్ యాదవ్, మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి గండి రాజు యాదవ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన పూజా



కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని తమ కుటుంబాలకు సుఖశాంతులు, సౌభాగ్యం కలగాలని ప్రార్థించారు. దుర్గా భవాని అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలని, సమాజంలో శాంతి, ఐకత, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. స్థానికంగా నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, ఐకమత్యాన్ని బలోపేతం చేస్తాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. భక్తులు, స్థానికుల భాగస్వామ్యంతో పూజా కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో రమేష్, సాయి ముదిరాజ్, బబ్లు, రాజేష్, నాని తదితరులు పాల్గొని శ్రీ దుర్గా భవాని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అసోసియేషన్ సభ్యులు చిన్న, దేవేందర్‌లను పలువురు అభినందించారు.

షాపూర్‌నగర్‌లో దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న కూన శ్రీనివాస్ గౌడ్

- అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలి: కూన శ్రీనివాస్ గౌడ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17, : గాజులరామారం సర్కిల్ పరిధిలోని షాపూర్‌నగర్ డివిజన్‌లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా షాపూర్‌నగర్‌లోని హెచ్ఎంటీ కళ్యాణ మండపంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు కూన రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో టీమ్ K.R.G నిర్వహిస్తున్న దుర్గాదేవి పూజా కార్యక్రమానికి మేడ్చల్–మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షులు, కేకేఎం ట్రస్ట్ అధినేత కూన శ్రీనివాస్ గౌడ్ తన కుమారుడు కూన సాయి చరణ్ గౌడ్‌తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న టీమ్ K.R.G సభ్యులను అభినందించారు.అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కూన శ్రీనివాస్ గౌడ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూన రవీందర్ గౌడ్, మురళి గౌడ్, జగన్ గౌడ్, కూన



రాఘవేందర్ గౌడ్‌తో పాటు రాంబాటి, వీరిశెట్టి, లక్ష్మీనారాయణ, బిల్లా వెంకటేష్, శ్రీనివాస్ (చిలుక), రామ్ చౌదరి, జగన్, సతీష్, హరీష్, ధనరాజ్, వెంకటేష్, అరుణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రయం లేని వారికి వృద్ధాశ్రమమే ఆసరా..

- మానవసేవే మాధవసేవగా భావించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం
- లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షులు, ప్రముఖ పారిశ్రామికవేత్త లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి
- తండ్రి చిల్లా నారాయణరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17, : ఆశ్రయం లేని వృద్ధులకు వృద్ధాశ్రమాలు ఆసరాగా నిలుస్తూ, వారికి మనోధైర్యాన్ని కల్పిస్తున్నాయని లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షులు, రాజ్యలక్ష్మి ఇండస్ట్రీస్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త లయన్ డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. తన తండ్రి, విశ్రాంత ఉపాధ్యాయులు కీర్తిశేషులు చిల్లా నారాయణరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జగద్గిరిగుట్ట పరిధిలోని ఆల్విన్ కాలనీలో ఉన్న రాజేశ్వరి వృద్ధాశ్రమంలో ఆయన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేసి, వారితో ఆత్మీయంగా గడిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మానవసేవే మాధవసేవగా భావిస్తూ, ఎన్నో ఏళ్లుగా పేదలు, వృద్ధులు, నిరాదరణకు గురైన దివ్యాంగులు, పేద విద్యార్థులకు తన వంతు బాధ్యతగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఆశ్రమ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పునరుద్ఘాటించారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతానని తెలిపారు.

వృద్ధాశ్రమానికి శాశ్వత భవనం నిర్మించాలి

రాజేశ్వరి వృద్ధాశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరి మాట్లాడుతూ.. ఆశ్రమ నిర్వహణకు ఎంతోమంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారని అన్నారు. వృద్ధులకు సేవలందించేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులకు శాశ్వత వసతి కల్పించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని శాశ్వత వృద్ధాశ్రమ భవన నిర్మాణానికి కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి ఉపాధ్యక్షులు లయన్ విష్ణువర్ధన్ రెడ్డి, మానస టూల్ టెక్ అధినేత, కవి వాకిటి రామిరెడ్డి, పారిశ్రామికవేత్తలు జింకల వెంకటేష్ ముదిరాజ్, కాట్రెడ్డి రమణారెడ్డి, హేమాద్రి నాయుడు, వృద్ధాశ్రమ సహాయకురాలు టి. శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో ప్రతి శనివారం ట్రాఫిక్ కష్టాలు.. పట్టించుకునే వారు కరువు..

ప్రభుత్వాలు మారినా.. అధికారులు మారినా మారని పరిస్థితి..



దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 17, :
దుబ్బాక పట్టణంలో ప్రతి శనివారం ట్రాఫిక్ సమస్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. తెలంగాణ తల్లి విగ్రహం నుంచి బస్టాండ్ వరకు వాహనాల రద్దీతో రహదారి కిక్కిరిసిపోతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, అధికారులు మారుతున్నా ఈ సమస్యకు మాత్రం పరిష్కారం లభించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శనివారం ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు.

ఇకనైనా స్పందించండి.. ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పించండి..

దుబ్బాక పోలీసు, మున్సిపల్ అధికారులు ఈ సమస్యపై తక్షణమే స్పందించి, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైన చోట ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి, వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని, ప్రతి శనివారం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని దుబ్బాక ప్రజలు కోరుతున్నారు.

జిల్లా ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17, :
జిల్లా ప్రజలకు, తెలంగాణ ఆడబిడ్డలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం ఒక ప్రకటనలో సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ మహిళలు ఉత్సాహంగా జరుపుకునే ఈ పండుగ ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత, కుటుంబ అనుబంధాలు, సామాజిక ఐక్యతను బతుకమ్మ పండుగ చాటిచెబుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించి, తెలంగాణ సంస్కృతికి మరింత గుర్తింపు కల్పించిందని తెలిపారు. ఒకప్పుడు తెలంగాణ పల్లెలకే పరిమితమైన బతుకమ్మ పండుగ నేడు దేశ విదేశాల్లోనూ ఘనంగా జరుపుకుంటున్నారని, ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటుతోందని అన్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా గౌరమ్మ ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు.

అల్విన్ కాలనీ ఫేస్-2లో ఘనంగా దేవి నవరాత్రి వేడుకలు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్



కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 17 :
అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఫేస్–2లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం కాలనీ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి మండపాన్ని డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందజేశారు. దేవి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా వారు అభినందించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, కృష్ణారావు, కట్టా శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గా నవరాత్రి, దసరాకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

పెగడపల్లి పోలీస్ స్టేషన్ లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ



జగిత్యాల/పెగడపల్లి, అక్టోబర్ 17, :
, జగిత్యాల జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శనివారం పెగడపల్లి పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రస్తుతం జరుగుతున్న దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. మండపాల వద్ద భద్రతా చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని, మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. పాత నేరస్తుల కదలికలను గమనిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎస్పీ వెంట ఎస్ఐ కుమార స్వామి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, అక్టోబర్ 17 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లో ఏర్పాటు చేసిన పలు దుర్గామాత మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని డా. సత్యం శ్రీరంగం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కావేటి నాగార్జున, రాజేష్ శంకర్ గౌడ్, అరవింద్ రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్‌పుత్, కొండల్ రెడ్డి, మల్లి యాదవ్, చైతన్య యాదవ్, అంజిరెడ్డి, పవన్, భార్గవ్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తా

- బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- విధాత్రి విల్లాస్‌లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర.. స్థానికుల సమస్యలపై ఆరా

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. శనివారం కొంపల్లి సర్కిల్ పరిధిలోని విధాత్రి విల్లాస్‌లో అధికారులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించి, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విధాత్రి విల్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, సమీప కాలనీల వాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తక్కువ నీటి ఒత్తిడితో తాగునీరు సరఫరా అవుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కొంపల్లి నుంచి విధాత్రి విల్లాస్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో చీకటిలో ప్రయాణించేందుకు భయపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అదనుగా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ప్రధాన రహదారిపై చెత్తను పడవేస్తున్నారని, దీంతో పరిసరాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. స్థానికుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. తాగునీటి సరఫరాలో నీటి ఒత్తిడిని పెంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రధాన రహదారిపై వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేసి రాత్రివేళల్లో ప్రజలకు భద్రత కల్పించాలని



సూచించారు. రహదారులపై చెత్తను అక్రమంగా పడవేయకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విధాత్రి విల్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కొంపల్లి మున్సిపల్ డీసీ లావణ్య, మాజీ చైర్మన్ సన్న కవితా శ్రీశైలం యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సంగీతా రెడ్డి, నాయకులు పూజారి లక్ష్మణ్ గౌడ్, కృష్ణ సాగర్, షన్ను భాయ్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ నేత చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి


- దేవి శరన్నవరాత్రుల సందర్భంగా పలు కాలనీల్లో ప్రత్యేక పూజలు.. ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17, : దేవి శరన్నవరాత్రుల పవిత్ర పర్వదినాలను పురస్కరించుకొని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి శనివారం పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి మండపాలను సందర్శించి, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల ఏడవ రోజు శ్రీ లక్ష్మీదేవి అమ్మవారిని దర్శించుకొని, అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర నగర్, గణేష్ నగర్, డీ నగర్



(చింతల్), ద్వారకా నగర్, అంబేద్కర్ నగర్, రాఘవేంద్ర కాలనీలలో స్థానిక కాలనీవాసులు భక్తిభావంతో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని బొంతపల్లి వీరభద్ర నగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని సందర్శించి, శ్రీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో సమాజంలో శాంతి, సామరస్యం నెలకొని ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రతి ఇంటా ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని★★ ఈ సందర్భంగా చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్న నేపథ్యంలో అమ్మవారి దర్శనం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్



- కొంపల్లి ఎస్.సి.ఎల్ కాలనీలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు

కొంపల్లి ప్రతినిధి, అక్టోబర్ 17, : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొంపల్లి డివిజన్ పరిధిలోని ఎస్.సి.ఎల్ కాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని శనివారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, బీజేపీ కొంపల్లి డివిజన్ అధ్యక్షులు పెద్ద బుద్దుల సతీష్ సాగర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల ఆశీర్వాదాన్ని పొందారు. అనంతరం కొంపల్లి శివాలయ ప్రాంగణంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాలు, అమ్మవారి మండపాలు భక్తులతో సందడిగా మారాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శివాజీ రాజు, శంకర్ నాయక్, పేట్ బషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు మాధురి, కొంపల్లి డివిజన్ నాయకులు ప్రకాష్ రావు, మధు, ఉప్పరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర కాలనీలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన మాధవ రెడ్డి, నరేందర్ రెడ్డి

జీడిమెట్ల ప్రతినిధి, అక్టోబర్ 17, : 132వ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో నిర్వహిస్తున్న దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవ రెడ్డి, వీరారెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ, ఉమాపతి, సతీష్‌తో పాటు కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఉత్సవాలకు హాజరైన వారు దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు, కాలనీవాసులు, వివిధ కాలనీల నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సోమయ్య నగర్‌లో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన బీఆర్ఎస్ యువ నాయకులు కొలుకుల జైహింద్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17, : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సోమయ్య నగర్‌లో స్థానికులు గణేష్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం భక్తిశ్రద్ధలతో సందడిగా మారింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువ నాయకులు కొలుకుల జైహింద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలుకుల జైహింద్ మాట్లాడుతూ, అమ్మవారి కృపాకటాక్షాలు డివిజన్ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ప్రశాంతమైన జీవనం గడపాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని, సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని కోరుకున్నారు. భక్తిభావంతో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనతో పాటు ఐక్యతా భావాన్ని పెంపొందిస్తున్నాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమం ద్వారా భక్తులకు సేవ చేసే అవకాశం



కల్పించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాయి విష్ణోష్, తోక గిరి, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేష్ జన్మదిన శుభాకాంక్షలు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి 17, అక్టోబర్ 17, : గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆయనకు పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దొడ్డెటి విజయ్ రామ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి సురేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు దొడ్డెటి విజయ్ రామ్ రెడ్డితో పాటు సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజు, గోవర్ధన్ రెడ్డి, రంజాన్, ప్రసాద్, సాయి రెడ్డి తదితర నాయకులు సురేష్‌ను అభినందించి, ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, మరిన్ని విజయాలు కలగాలని ఆకాంక్షించారు.




పార్టీ బలోపేతానికి నాయకుల అభినందనలు

గాజులరామారం డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు పరస్పర ఆత్మీయతతో, ఐకమత్యంతో ముందుకు సాగుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకులు సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని నాయకులు ఒకచోట చేరి శుభాకాంక్షలు తెలియజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా నాయకులు సురేష్‌కు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రజలకు సేవ చేస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. నాయకులు, కార్యకర్తల మధ్య ఇలాంటి ఆత్మీయ కలయికలు పార్టీ శ్రేణుల్లో స్నేహభావాన్ని, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. సీనియర్ నాయకులు సురేష్ జన్మదిన వేడుకలు పార్టీ నాయకుల మధ్య ఆనందోత్సాహాలను నింపగా, ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదిన శుభాకాంక్షలు అందజేసిన వారిలో గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దొడ్డెటి విజయ్ రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజు, గోవర్ధన్ రెడ్డి, రంజాన్, ప్రసాద్, సాయి రెడ్డి తదితరులు ఉన్నారు.

తుల్జా భవానిని దర్శించుకున్న పులిమామిడి రాజు దంపతులు

- సంగారెడ్డి ప్రజల సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు.. భక్తులకు అన్నదానం

సదాశివపేట, అక్టోబర్ 17, : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తుల్జాపూర్‌లో కొలువుదీరిన శ్రీ తుల్జా భవానీ అమ్మవారిని సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి పులిమామిడి రాజు, ఆయన సతీమణి, సదాశివపేట మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పులిమామిడి రాజు ఆధ్వర్యంలో తుల్జాపూర్‌కు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.పండితులు రోహిత్ కదం పరమేశ్వర్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, గోందళం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవక రైతులు పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో నీటి సమస్యలు తలెత్తకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, పాడిపంటలతో గ్రామాలు కళకళలాడాలని, సకాలంలో వర్షాలు కురిసి నీటి సమస్యలు తొలగిపోవాలని ప్రార్థించినట్లు చెప్పారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం



ద్వారా భక్తులకు సేవ చేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందని పులిమామిడి రాజు పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమంలో తుల్జాపూర్‌కు వచ్చిన భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో పులిమామిడి రాజు మిత్రులు నర్సింలు, తాలెల్మ రాము, సోమ శంకర్, పీఎంఆర్ యువసేన నాయకులు, కుటుంబ సభ్యులు గాండ్ల పద్మ, మనోజ్, మాధవి, రాణి, లక్షి తదితరులు పాల్గొన్నారు.

నవజీవన్ నగర్‌లో ఘనంగా ఉచిత మెడికల్ క్యాంప్

• ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజన్న, బండి రమేష్



కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 17 : ప్రజల ఆరోగ్యమే సమాజానికి నిజమైన సంపద అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయమని ఆయన అన్నారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్ నగర్‌లో పాస్టర్ క్రిస్టఫర్, సులోచన ఆధ్వర్యంలో శనివారం ★'ఆరోగ్యమే నిజమైన వరం'★ అనే నినాదంతో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ సిరిసిల్ల రాజన్నతో కలిసి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. నేటి బిజీ జీవితంలో మారుతున్న జీవనశైలి కారణంగా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందవచ్చని సూచించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో ఇలాంటి వైద్య శిబిరాలను నిర్వహించడం గొప్ప సేవా కార్యక్రమమని కొనియాడారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సేవాభావంతో మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులు పాస్టర్ క్రిస్టఫర్, సులోచనలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పుష్ప రెడ్డి, లక్ష్మయ్య, పులి శివకుమార్ గౌడ్, శ్రీకాంత్ పటేల్, మధు మోహన్, జిల్లా శివ, జావిద్, రేణుక, సంపూర్ణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కృష్ణానగర్ కాలనీలో ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

• ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17, : 132వ డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కృష్ణానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శనివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి, సమ్మెట ఎల్లాగౌడ్ లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలోనూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, వివిధ కాలనీల నాయకులు, భక్తులు, కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ


• కలెక్టరేట్, సదాశివపేటలో వేడుకల్లో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి

సదాశివపేట, అక్టోబర్ 17, :
సంగారెడ్డి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఉద్యోగులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు.రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పడి సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన బతుకమ్మ పాటలు వేడుకలకు మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీత, డీఎంహెచ్‌వో లలితాదేవి, కలెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.సదాశివపేటలోనూ సందడి సదాశివపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లోనూ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిని పూజిస్తూ పూలతో నిర్వహించుకునే బతుకమ్మ పండుగ తెలంగాణకు ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ,



వైస్ చైర్‌పర్సన్ రేణుక చిరు, కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీ రాఘవేంద్ర కాలనీలో దుర్గామాత మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు దమ్మని శ్రవణ్ కుమార్



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 17, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 286వ కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ రాఘవేంద్ర కాలనీలో కొలువుదీరిన దుర్గామాత మండపం వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దమ్మని శ్రవణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన ఆయన, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని దుర్గామాతను ప్రార్థించారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాఘవేంద్ర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నారాయణ, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ ముదిరాజ్, ఉద్యమకారుడు, గ్రేటర్ హైదరాబాద్ మాజీ సెక్రటరీ గుమ్మడి మధుసూదన్ రాజు ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ డివిజన్ అధ్యక్షులు సంతోష్ కుమార్ చారి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీసీఎల్ అధ్యక్షులు రంగయ్య, పూర్ణచందర్, కిషోర్ కుమార్, రాజు, వానపురం ప్రసాద్‌తో పాటు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

• మహిళా ఉద్యోగులు, పొదుపు సంఘాల సభ్యులు, పారిశుధ్య కార్మికుల ఆటపాటలతో పండుగ సందడి

• అధికారులతో కలిసి బతుకమ్మ ఆడిన మహిళా పారిశుధ్య కార్మికులు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17, : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ పాటలు, మహిళల ఆటపాటలతో ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో సర్కిల్ మహిళా ఉద్యోగులు, పొదుపు సంఘాల మహిళలు, రిసోర్స్ పర్సన్లు (ఆర్‌పీలు), పారిశుధ్య మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లతో సందడి చేశారు. పండుగ వాతావరణంలో మహిళలంతా కలిసిమెలిసి బతుకమ్మ ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. ఈ వేడుకల్లో అధికారులు, కార్యాలయ సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు, పారిశుధ్య కార్మికులు ఒకే వేదికపై కలిసి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే మహిళా ఉద్యోగులు, నగర పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుధ్య కార్మికులు సంప్రదాయ పండుగలో భాగస్వాములు కావడంతో కార్యాలయంలో పండుగ సందడి నెలకొంది.

ఐక్యత, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ

బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయతకు, ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇటువంటి వేడుకలు మహిళల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు, తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అన్ని వర్గాల మహిళలు కలిసికట్టుగా పండుగను జరుపుకోవడం సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుంది. ఈ సందర్భంగా అధికారులు, మహిళా సిబ్బంది బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెబుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. మహిళా ఉద్యోగులు, పొదుపు సంఘాల సభ్యులు, ఆర్‌పీలు, పారిశుధ్య మహిళా కార్మికుల భాగస్వామ్యంతో దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

బతుకమ్మ సంబరాల ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్

• ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17, :
బతుకమ్మ సంబరాలు, దసరా పండుగ నేపథ్యంలో సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు, రూబీ నెక్లెస్ రోడ్డు ప్రాంతాల్లో పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ శనివారం పర్యటించి పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కోమటి చెరువు పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యాలు, పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీసు, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పండుగకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కోమటి చెరువుపై ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల అలంకరణను పరిశీలించిన పోలీస్ కమిషనర్, లైటింగ్ ఏర్పాట్లు బాగున్నాయని మున్సిపల్ అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవీందర్ రెడ్డి, మున్సిపల్ ఆర్వో బాలకృష్ణ, ఏఈలు పృథ్వి, జమిల్, వన్‌టౌన్ సీఐ మహేష్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహేష్, శివకుమార్, మున్సిపల్ అధికారులు,



సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ ప్రశాంత జీవనం గడపాలి

• వై.ఎఫ్.సి.ఏ జంట నగరాల గౌరవ అధ్యక్షులు దంపనబోయిన శ్రీనివాస్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17, : శ్రీ దుర్గాదేవి అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ప్రశాంతమైన జీవనం గడపాలని వై.ఎఫ్.సి.ఏ జంట నగరాల గౌరవ అధ్యక్షులు, శెట్టిబలిజ సంఘం సలహాదారులు దంపనబోయిన శ్రీనివాస్ ఆకాంక్షించారు. శనివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డినగర్‌లో స్థానిక శెట్టిబలిజ సంక్షేమ సంఘం, శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వై.ఎఫ్.సి.ఏ జంట నగరాల నూతన కమిటీ అధ్యక్షులు పిచ్చెట్టి దేవేందర్ రావు, ప్రధాన కార్యదర్శి దొమ్మేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, గణపతి కొండలరావు, అడ్వకేట్ కే.ఎల్.బి. కుమార్, పి.వి.వి. సత్యనారాయణ, పితాని శ్రీనివాస్, కుడుపూడి శ్రీనివాస్‌లను సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు కుడుపూడి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వేంద్ర చలపతిరావు, కోశాధికారి వాసంశెట్టి రాంబాబు, సంఘం పెద్దలు వాసంశెట్టి దుర్గాప్రసాద్, విత్తనాల భాస్కరరావు, వాసంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ జన్మదిన వేడుకలు

• వారాల వినోద్‌కు శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 17, : బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వారాల వినోద్ జన్మదిన వేడుకలు శనివారం సూరారం మస్తాన్ బిల్డర్స్‌లోని ఆయన నివాస కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై వారాల వినోద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, వారాల వినోద్ పార్టీ సీనియర్ నాయకుడిగా ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరింత చురుకుగా పాల్గొంటూ, ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. వారాల వినోద్ జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకలతో నివాస కార్యాలయం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని వారాల వినోద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



మత్తు రహిత యువతే లక్ష్యం- తోట కమలాకర్ రెడ్డి



దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), అక్టోబర్ 17, : మత్తు రహిత యువతే లక్ష్యంగా నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ 2026-27 కార్యక్రమాన్ని శనివారం మిరుదొడ్డిలోని రామాలయ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమలాకర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలు, మద్యానికి దూరంగా ఉండాలని, చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం మత్తు రహిత భారతదేశం కోసం యువతతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మొగుళ్ల ఐలయ్య, మాజీ ఎంపీటీసీ గొట్టం బైరయ్య, బీజేపీ జిల్లా నాయకులు, వార్డు సభ్యులు నరేష్, పూస రాజు, సదానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ చేసిన

పెద్దగుండవెల్లి గ్రామ సర్పంచ్ వజ్రవ్వ, సల్మాన్



దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 17, :
సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామానికి సంబంధించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను శనివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సద్ది రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్, సర్పంచ్ వజ్రవ్వ, సల్మాన్ రాజు ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్.. రిమాండ్..



దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 17, : దాయాదుల మధ్య ఆస్తి తగాదాల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలోని ఓ కల్లు కాంపౌండ్ లో తరేపల్లి గ్రామానికి చెందిన తోట్ల యాదగిరిపై అతని సమీప బంధువు తోట్ల సత్తయ్య కల్లు సీసాతో దాడి చేశాడు. ఆస్తి గొడవల నేపథ్యంలో తలపై, ముఖంపై దాడి చేయడంతో యాదగిరి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడు తోట్ల సత్తయ్యపై హత్యాయత్నం కేసు పెట్టి శనివారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న బోగ శ్రావణి

జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 17, :



దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం జగిత్యాల పట్టణంలోని శ్రీ నవదుర్గ పీఠ క్షేత్రంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ బోగ శ్రావణి ప్రవీణ్. ఈ కార్యక్రమంలో జగిత్యాల్ పట్టణ అధ్యక్షులు కాశెట్టి తిరుపతి, బిజెపి మున్సిపల్ ఫ్లోర్ వేముల శ్రీనివాస్, కౌన్సిలర్లు సిరిపురం శ్రీలత శ్రీనివాస్, నిమ్మల నాగరాజు, ఆముద రాజు, కొండ్ర రవితేజ,ఇట్యాల రాము,అది మల్లారెడ్డి, బోగ నరేష్ నవదుర్గ సేవా సమితి సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు,

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సొంత నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

- **మూసాపేట్ పరిసర కాలనీల ప్రజలకు ఊరట కల్పించేలా ముందడుగు**

కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 17 : మూసాపేట్ ప్రధాన రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపారు. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శనివారం తన సొంత నిధులతో తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.

ఏళ్లుగా నెరవేరని హామీతో ప్రజలకు ఇబ్బందులు

మూసాపేట్–ఖైతలాపూర్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారిపై ట్రాఫిక్ రద్దీ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఓ ప్రైవేట్ సంస్థ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం చేపట్టిన సమయంలో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రోడ్డు నిర్మాణానికి కొంత స్థలాన్ని కేటాయించింది. అయితే నిర్మాణాలు పూర్తయిన అనంతరం రోడ్డు వేస్తామని ఇచ్చిన హామీ ఏళ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదు. దీంతో స్థానిక కాలనీవాసులు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం అధికారులను సంప్రదించగా, నిధుల కొరత కారణంగా రోడ్డు నిర్మాణం చేపట్టలేకపోతున్నామని వారు తెలిపినట్లు స్థానికులు పేర్కొన్నారు. దీంతో కాలనీవాసులు ఈ సమస్యను వడ్డేపల్లి రాజేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు.

సొంత ఖర్చులతో తాత్కాలిక రోడ్డు నిర్మాణం

స్థానిక ప్రజల సమస్యను తెలుసుకున్న రాజేశ్వరరావు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే ఆంజనేయ నగర్, ప్రగతి నగర్, శ్రీహరి కాలనీ, పవర్ నగర్, శక్తి నగర్ కాలనీల ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు గణనీయంగా తగ్గుతాయని గుర్తించారు. వెంటనే స్పందించి, ప్రజల రాకపోకలకు సౌకర్యం కల్పించే ఉద్దేశంతో తన సొంత నిధులతో తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా



వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయడం, ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అని పేర్కొన్నారు.

కాలనీవాసుల హర్షం

ప్రజల ఇబ్బందులను గుర్తించి తక్షణమే స్పందిస్తూ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంపై స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, నివాసితులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ప్రయోజనాల కోసం ముందుకొచ్చిన వడ్డేపల్లి రాజేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైతలాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు ఐలయ్య, కొడిచర్ల వినోద్, పండుగ రేణుక, ఈ. సాయి, శ్రీనివాస్ చారి, చక్రి, పార్టీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షురాలుగా లక్కం రాజ్యలక్ష్మి

హైదరాబాద్ బ్యూరో, అక్టోబర్ 15, :
హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు లక్కం రాజ్యలక్ష్మి నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని సంస్థ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు, జాతీయ చైర్మన్ మహమ్మద్ తక్దీర్ అలీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఇందులో భాగంగా లక్కం రాజ్యలక్ష్మి ని తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా ప్రకటించారు.



ఈ సందర్భంగా లక్కం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణ, వారికి న్యాయపరమైన అవగాహన కల్పించడం, సమస్యల పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించడమే హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ నేషనల్ జనరల్ సెక్రెటరీ సన, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రమ్యశ్రీ, వివిధ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పెద్దపల్లి అధ్యక్షులు కొమ్ము ఓదెలు జిల్లా జనరల్ సెక్రటరీ గడ్డం సత్యనారాయణ, మీడియా సెక్రటరీ బోయిని ప్రసాద్, జాయింట్ సెక్రటరీ గీట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ సంక్షేమానికి కట్టుబడి ఉన్నా

- **రోజు వాకింగ్ తో మెరుగైన ఆరోగ్యం**
- **జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్***

జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 17, :
జగిత్యాల దరూర్ క్యాంప్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలోని వాకర్స్ సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూ ఉంటానని అన్నారు. ఎస్కేఎన్ఆర్ వివేకానంద మినీ స్టేడియం, దరూర్ క్యాంప్ గ్రౌండ్‌లో వాకర్స్‌కు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. వాకర్స్ సౌలభ్యం కోసం ఇప్పటికే ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, జగిత్యాల పట్టణంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం తరఫున నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు, కౌన్సిలర్ ప్రశాంత్ రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సయ్య, వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు గాడిపెల్లి చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దేవనపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు విటల్, కోశాధికారి రాణా ప్రతాప్, సంయుక్త కార్యదర్శి గుగులోత్ రాజేష్, తుమ్మనపల్లి రమేష్, ప్రచార కార్యదర్శి సల్ల లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు, మాజీ అధ్యక్షులు వెంకటేశ్వర రావు, సర్పంచ్ సురేందర్, రంగు రాజయ్య, నాయకులు, వాకర్స్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులపై దాడి చేసిన ఎస్సైని తోలగించాలి

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంకటి శేఖర్

కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17, :
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురైన ఎకదం న్యూస్ ఎడిటర్ జర్నలిస్టులు పొత్తూరి శేఖర్, రాతిపల్లి సంపత్‌లను శనివారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించాడాం జరిగింది. నిజాన్ని నిర్భయంగా న్యూస్ రూపంలో రాసినందుకే పోలీసులు జర్నలిస్ట్ లను చిత్రహింసాలు పెట్టారని అన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి, ఘటనపై ఉన్నతస్థాయి,నిష్పక్షపాత విచారణ జరిపించాలి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐ శ్రీకాంత్‌ను తక్షణమే సర్వీసు నుండి తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జక్కని సంజయ్, ఉరుమళ్ల విశ్వం, తాళ్లపల్లి శ్రీకాంత్, జెరూపోతుల మహేందర్, కళ్ళపెల్లి అరవింద్, నక్క ప్రమోద్, మనోజ్, వెంకటేష్, పల్లే సురేందర్ తదితరులు పాల్గొన్నారు



గాయత్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న జ్యోతి లక్ష్మణ్



జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 17, :
జగిత్యాల పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో శ్రీ గాయత్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కమల అర్చన పూజా కార్యక్రమంలో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొనడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



జానపద సోయగం... జాలాది సాహిత్యం

పల్లె పలుకును పాటగా మలిచిన జనకవి జాలాది

నేడు జాలాది వర్ధంతి

తెలుగు సాహిత్య గగనంలో కొన్ని నక్షత్రాలు కవిత్వపు కాంతులతో మెరిస్తే, మరికొన్ని ప్రజల గుండెల చప్పుడై, వారి పెదవులపై పాటై అమరత్వాన్ని పొందుతాయి. సాంప్రదాయ కవిత్వపు పొలిమేరల నుంచి జానపద జీవన ముంగిట్లోకి సాహిత్యాన్ని నడిపించి, మట్టివాసనల సౌరభాన్ని వెండితెరకు అద్దిన అరుదైన గేయశిరోమణి జాలాది రాజారావు. పల్లె సీమల సహజ సౌందర్యాన్ని, సామాన్యుల బతుకు పోరాటాన్ని, పేదల అనుభూతులను తన కలానికి ఇంధనంగా మార్చుకున్న అక్షర శిల్పి ఆయన. జాలాది పాట ఒక శబ్ద సమ్మేళనం మాత్రమే కాదు; అది ఒక ప్రాంతీయ జీవన చిత్రం, ఒక సామాజిక దర్పణం, మానవ సంబంధాల అంతఃసూత్రం.

కృష్ణా జిల్లా గుడివాడ నేలపైన అమృతమ్మ, జాలాది ఇమ్మానుయేలు దంపతులకు 1932 ఆగస్టు 9న జాలాది రాజారావు జన్మించారు. తండ్రి స్వాతంత్ర్య సమర యోధుడిగా, జిల్లా బోర్డు సభ్యుడిగా అందించిన సామాజిక స్పృహ జాలాది వ్యక్తిత్వానికి పునాది వేసింది. ఎస్.ఎస్.ఎల్.సీ.లో తెలుగు ప్రత్యేక పాఠ్యాంశంతో ఉ ఉత్తీర్ణులైన ఆయన, చిత్రలేఖనం పట్ల ఉన్న ఆసక్తితో డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా వీరఘట్టంతో పాటు రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో పనిచేసిన కాలం ఆయన జీవితంలో కీలకమైన మలుపు. ఆయా ప్రాంతాల మాండలికాలు, మౌఖిక జానపద రూపాంతరాలు, ప్రజల నోటి పలుకు బడులను ప్రత్యక్షంగా శోధించి స్వీకరించే అవకాశం ఈ ఉద్యోగ జీవితమే కల్పించింది. అక్షరాలకు రంగులు అద్దే క్రమంలో ఆయనలోని కవిత్వం పరిణతి చెందింది. ఫలితంగా 1968లో ఉపాధ్యాయ వృత్తికి స్వస్తి చెప్పి, సాహిత్య సాధనకై మద్రాసు సినీ నికేతనానికి పయనమయ్యారు.

1976లో 'పల్లెసీమ' చిత్రంతో సినీ గేయ ప్రపంచంలోకి అడుగుపెట్టిన జాలాది, సంగీత దర్శకుడు కె.వి. మహదేవన్ స్వరకల్పనలో రాసిన "సూరట్టుకు జారతాది సిటుక్కు సిటుక్కు వాన చుక్క" పాటతో తెలుగు శ్రోతలను ఒక్కసారిగా పరవశింప జేశారు. ఆరంభంలోనే జానపద శైలికి కొత్త ఊపిరి పోసిన ఆయన, ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో సుమారు 270కి పైగా చిత్రాలకు 1,500 నుండి 1,800 వరకు సజీవ గీతాలను అందించారు. గణాంకాలలో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, ప్రతి పాటలోనూ ఒక నాటుదనం, శ్రామిక సౌందర్యం నిండి ఉండటం ఆయన ప్రత్యేకత. 'మజూరి' శ్రమను 'మాధురి'గా మార్చడంలో జాలాది కలం సిద్ధహస్తుడు.

జాలాది గేయ సాహిత్యాన్ని పరిశీలిస్తే అందులో భావ కవిత్వపు లాలిత్యం, జానపదపు వాకిలి, సామాజిక దృక్పథాల త్రివేణి సంగమం కనిపిస్తుంది. "యాతమేసి తోడినా ఏరు ఎండదు" అని అమాయక రైతు హృదయాన్ని ఆవిష్కరించినా, "ఈ కాలం పది కాలాలు బతకాలనీ" అని కుటుంబ అనుబంధాల ప్రాశస్త్యాన్ని చాటినా, "పుణ్యభూమి నా దేశం నమో నమామి" అని దేశభక్తి నిండిన భావోద్వేగాన్ని విశ్వరూపంలో చూపించినా అది జాలాదికే సాధ్యమైంది. భావాన్ని క్లిష్టమైన గ్రాంథికంలో కాక, నిత్య జీవితంలో ఉపయోగించే తెలుగు నుడికారంలో, మాండలికాల సొబగులో పొదిగి చెప్పడం ఆయన రచనా వైశిష్ట్యం.

ఆయన ప్రతిభ కేవలం చలనచిత్ర రంగానికే పరిమితం కాలేదు. రంగుల లోకానికి రాకముందే 'విశ్వ మోహిని', 'కాకులమ్మ' వంటి కావ్యాలను, 'అమరజీవి', 'తండ్రి', 'సమాధి', 'కారు మేఘాలు' వంటి నాటకాలను రచించి రసజ్ఞుల మెప్పు పొందారు. ఉపాధ్యాయుడిగా పొందిన పరిశీలనా దృష్టి, కవిగా సాధించిన భావ పరిపక్వత, నాటకకర్తగా పండించిన సంభాషణా చతురత---ఈ మూడూ కలిసి ఆయనను అసాధారణ గేయ రచయితగా నిలబెట్టాయి.

ఈ సాహిత్య సేవలకు గాను ఆయనకు అనేక సత్కారాలు లభించాయి. విజయవాడ కల్చరల్ అసోసియేషన్, ట్విన్ సిటీస్ కల్చరల్ అవార్డులతో పాటు 1987లో మద్రాసు కలాసాగర్ అవార్డు దక్కింది. 1990లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది పురస్కారంతో గౌరవించగా, తదనంతర కాలంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదును అందజేసింది. 2011 అక్టోబరు 14న విశాఖపట్నంలో ఆయన భౌతిక దేహాన్ని విడిచినప్పటికీ, ఆయన రాసిన పాటలు తెలుగువారి గుండెల్లో శాశ్వతంగా నిలిచి పోయాయి.

కృత్రిమ అలంకారాల కన్నా సహజ అనుభూతికి, సంక్లిష్ట సమాసాల కన్నా పల్లె పదబంధాలకే జాలాది ప్రాణప్రతిష్ఠ చేశారు. వెండితెరపై జనపదాల గొంతును నిలబెట్టి, పల్లె మనిషి ఆవేదనకు అక్షర రూపమిచ్చిన ఈ ప్రజాకవి, తెలుగు సినీ సాహిత్య చరిత్రలో చెరగని ముద్ర వేసిన జానపద గేయశిరోమణిగా చిరస్మరణీయుడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ప్రమాణాల పాటింపుపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి

నేడు ప్రపంచ ప్రమాణాల దినోత్సవం



వస్తువులన్నింటికీ నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు ఉన్నా, సర్వం నాసిరకం అవుతున్న నేటి పరిస్థితులలో ప్రభుత్వాలు ప్రతి వస్తువు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ప్రపంచ లేదా అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 14న నిర్వహించ బడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు తమతమ దేశాలలో ప్రమాణాలను నిర్ణయించిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఏఎస్ఎంఈ), ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ), ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ), ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయు), ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ), ఇంటర్నెట్ ఇంజనీరింగ్ టాస్క్ ఫోర్స్ (ఐఈటీఎఫ్) వంటి ప్రమాణాల అభివృద్ధి సంస్థలలో వినియోగ దారులు, నియంత్రకాలు మరియు పరిశ్రమలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రామాణీకరణ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం ఈ రోజు యొక్క ఉద్దేశ్యం. వేలాది మంది నిపుణుల కృషిని గుర్తు చేస్తూ జరుపు కుంటారు. 1946, అక్టోబరు 14న లండన్‌లో జరిగిన సమావేశంలో 25 దేశాల ప్రతినిధులు పాల్గొని వినియోగ దారులకు ప్రామాణిక మైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణిక సంస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. దానికి గుర్తుగా



అక్టోబరు 14న ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుప బడుతుంది. ఒక సంవత్సరం తరువాత అంతర్జా తీయ ప్రమాణిక సంస్థ ఏర్పడినప్పటికీ, 1970 వరకు మొదటి ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపు కోలేదు. ప్రస్తుతం ఈ సంస్థలో 125 సభ్య దేశాలు ఉన్నాయి. ప్రామాణీకరణ యొక్క ప్రాముఖ్యత గురించి పరిశ్రమలు, వినియోగ దారులలో అవగాహన పెంచుతారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలోని జాతీయ సంస్థలు వేరువేరు రోజుల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. 2014లో యునైటెడ్ స్టేట్స్ 2014, అక్టోబరు 23న ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహించింది. కెనడా దేశపు జాతీయ అక్రెడిటేషన్ బాడీ అయిన స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా (ఎస్.సి.సి) అంతర్జాతీయ సంస్థలతో కలిసి ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 2012లో స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా అక్టోబరు 12 శుక్రవారం రోజున ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంది. 1947లో భారతదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ చట్టాన్ని ఆమోదించి బ్యూరోను ఒక శాసన బద్ధమైనా సంస్థగా మార్చారు. అప్పటి నుంచే ఐ.ఎస్ .ఐ ముద్ర ప్రకటితమైంది. ఈ ముద్ర గల వస్తువులు నాణ్యత కలిగినది. 1947లో భారతీయ ప్రమాణాల సంస్థ మొదటి రెండు విభాగాలను ఏర్పాటు చేసింది. ఒకటి బట్టలకు, రెండవది ఇంజనీరింగ్‌కు సబంధించినది. ఈ సంస్థ నిర్ణయించిన తొలి ప్రమాణం ఏమిటో తెలుసా, మన జాతీయ పతాకం ఎంత పొడవు, వెడల్పు ఉండాలన్నది ఈ సంస్థ నిర్ణయించింది. 1951లో ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సంస్థ కార్యాలయంలో స్వీకరించారు. అంతే కాదు మెట్రిక్ విధానాన్ని దేశంలో 1955లో ప్రవేశ పెట్టారు. తర్వాత తూనికలు, కొలతల పరిమాణాన్ని చట్టాన్ని ఆమోదించింది. కాలక్రమంలో టెలి కమ్యూనికేషన్స్ టీకాలు, నూనె గింజలు, త్రాగునీరు, పాడి పరిశ్రమ వంటివి కూడా ఈ సంస్థ పరిధిలోకి చేర్చారు. ఐఎస్ఐ మార్కు సంస్థ అనుమతి లేనిదే ఎవరూ వాడ కూడదు. అన్ని సాంకేతిక పరీక్షలు, తనిఖీలు నిర్వహించిన దరిమిలా ఒక సంవత్సరానికి ఐఎస్ఐ లైసెన్స్ ఇస్తుంది. ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలి. ప్రమాణాలు నిర్ణయించడానికి ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు ఈ రోజునే ప్రారంభించాయి. కనుక ఈ రోజున వరల్డ్ స్టాండర్స్‌డే గా జరుపు కుంటారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

దృశ్య మాధ్యమాన్ని సామాజిక అస్త్రంగా మలిచిన వేదగిరి

నేడు వేదగిరి రాంబాబు జయంతి



వేదగిరి రాంబాబు గుంటూరు జిల్లా తెనాలి తాలూకా చుండూరులో 1952 అక్టోబరు 14న పూర్ణచంద్రరావు, భార్గవి దంపతులకు జన్మించాడు. అతని తండ్రి ఎక్సైజ్ శాఖలో ఉద్యోగిగా తన విద్యుక్త ధర్మాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నందున రాష్ట్రంలో అనేక ప్రాంతాలకు బదిలీ పై వెళ్ళవలసి వచ్చింది. అలా రాంబాబు బాల్యం, చదువు అంతా వివిధ ప్రాంతాలలో కొనసాగింది. రాంబాబు నాటకాలలో గానీ, సినిమా ఛాన్సులకోసం ప్రయత్నించడం కానీ అతని తండ్రికి యిష్టముండేది కాదు. డిగ్రీ చదువుతున్నప్పుడే అతనిలో సాహిత్యం పట్ల క్రమంగా అభిరుచి పెరిగింది. సాహితీ కారునిగా అతనికి యర్రంశెట్టి సాయి రచనలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ప్రముఖ రచయితలైన యర్రంశెట్టి సాయి, ఆదివిష్ణు, విహారిలను గురుతుల్యులుగా భావించాడు. 1974 సంవత్సరంలో డిగ్రీ ఫైనలియర్‌లో చదువు తుండగా ఆంధ్రపత్రిక దీపావళి కథల పోటీకి సరదాగా పంపిన తన తొలికథ 'సముద్రం' బహుమతి సాధించి పెట్టింది. ఇక అదే క్రమంలో అప్పటి ప్రముఖ వార పత్రికలైన యువ, జ్యోతి, స్వాతి, ఆంధ్రపత్రికలకు వరసగా కథలు పంపిస్తుండే వాడు. కొంతకాలం ఆలిండియా రేడియోలో అనౌన్సర్‌గా పనిచేశాడు. రాంబాబు కథానికలకు రేడియో ద్వారా మంచి ప్రాచుర్యం లభించింది. ఆయన ఫ్రీలన్స్ జర్నలిస్టుగా వివిధ దినపత్రికలకు అనేక వ్యాసాలను వ్రాసి పంపించే



వాడు. కొంతకాలం ఆంధ్రభూమి వారపత్రికలో సీనియర్ జర్నలిస్టుగా చేశాడు. పల్లకి వారపత్రికకు సంపాదకుడిగా పనిచేశాడు. ఎక్కడ ఏ ఉద్యోగం చేసినా తనలోని రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తునే ఉన్నాడు. దూరదర్శన్ అందుబాటు లోకి వచ్చాక దృశ్య మాధ్యమాన్ని సామాజిక అస్త్రంగా మలిచి జనాలలో మార్పు తేవాలని ఆశించాడు. ఆ క్రమంలోనే 'పాపం పసివాడు' సీరియల్‌ను 52 వారాలపాటు నిరంతరాయంగా దూరదర్శన్‌లో రూపొందించాడు. ఎన్నో కష్టనష్టాల కోర్చి దూరదర్శన్ టెలీ సీరియల్‌ను తన సొంత ఖర్చుతోనే భరించి తీర్చిదిద్దాడు.

రాంబాబు తీసిన టెలిఫిల్మ్‌కు ఉత్తమ నిర్మాత, దర్శకునిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున బంగారు నంది అవార్డు దక్కింది. కృష్ణమోహన్ టైటిల్ సాంగ్ కు కూడా నంది అవార్డు వచ్చింది. తర్వాత 'అడవి మనిషి' సీరియల్‌కు రజిత నంది వచ్చింది. దూరదర్శన్‌లో శైలజా సుమన్, రమణీ సన్యాల్ వంటి వారితో కలిసి ఇన్‌హౌస్ సీరియల్ని చేశాడు. దాదాపు రెండు సంవత్సరాల పాటు ఎంతో కష్టపడి జైలు అధికారుల అనుమతి తీసుకుని రాష్ట్రంలోని పలు జైళ్లలో పరిస్థితుల ప్రభావం చేత ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్న ఖైదీల యథార్థ గాథలను తీసుకుని వాటినే తన కథా వస్తువులుగా చేసుకుని 'జైలుగోడల మధ్య' సీరియల్ ను రూపొందించాడు. అంతకుముందే అది స్వాతి వారపత్రికలో దాదాపు 60-70 వారాల పాటు పాఠకులను అలరించింది. రాంబాబు రాసిన 'జైలుగోడల మధ్య' పుస్తక రూపంలో దాదాపు చాలా భాషల్లో ప్రచురితమైంది. బాలసాహిత్యం లోనూ బాలల కోసం ఆయన చేసిన కృషి అజరామరం. "ఇంద్ర ధనుస్సు" అనే బాలల తొలి వీడియో మేగజైన్‌కు తొలి ఎడిటర్‌గా పనిచేశాడు.

తెలుగు కథానికలపై వాటిని చిన్నచూపు చూసే వారిపై ఆయన విమర్శనాస్త్రాలు సంధిస్తూ ఉండేవాడు. ఏనాటికైనా వాటికి కూడా జాతీయస్థాయి గుర్తింపు తేవాలని ఆయన ఉద్దేశం. గ్లోబల్ ఆసుపత్రి మీడియా ఇన్‌ఛార్జిగా పనిచేస్తూ తనవద్దకు సాయం కోసం వస్తే వాళ్లకు ఉదారంగా తనకు సాధ్యమైనంతలో వారికి తక్కువ ఖర్చుతోనే వైద్య సేవలు చేయిస్తూ ఇతోధిక సేవలందిస్తుండే వాడు.

వంద కథానికల పూర్తి వివరాలతో 'తెలుగు కథానిక డాట్ కామ్' కూడా ప్రారంభించాడు. 23 జిల్లాల కథానిక తీరుతెన్నులగూర్చి పోటీపెట్టి వ్యాసాల్ని సేకరించాడు. ఈ వ్యాస సంకలనాలను జయంతి సభలో ఆవిష్కరించాడు. అలాగే రచయితల చిరునామాలతో ఒక డైరెక్టరీని తీసుకొచ్చాడు.తప్పక చదవాల్సిన వంద కథానికలు అనే పేరుతో ఒక పుస్తకం వెలువరించారు. మహాకవి గురజాడ అప్పారావు 153వ జయంతి పురస్కరించుకుని సెప్టెంబర్ 21, 2015 న గురజాడ పురస్కారం అందజేసారు. ఆయన సుమారు రెండు వేలకు పైగా గురజాడకు సంబంధించిన కథలు, కథానికలు రచించారు.

సముద్రం గ్రంథానికి తెలుగు విశ్వ విద్యాలయం ఉత్తమ కథానిక సంపుటి పురస్కారం, పాపం పసివాళ్ళు ధారావాహికం - రాష్ట్ర ప్రభుత్వ బంగారు నంది, అడవి మనిషి - టెలిఫిల్ం - రజత నంది, ఆకాశవాణిలో జింగిల్స్ కు ప్రసార భారతి పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వం నుండి గురజాడ స్మారక పురస్కారం, గిడుగు పురస్కారం,

కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ సత్కారం అందుకున్నారు. 2018ఆగస్టు 28న రాంబాబు ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494




ముంబై ఇండియన్స్‌కు కొత్త కోచ్!

ముంబై, అక్టోబరు 17 : ఐపీఎల్‌లో ఐదుసార్లు టైటిల్ సాధించిన ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. జట్టు ప్రధాన కోచ్ మహేల జయవర్ధనేతో తన ప్రయాణాన్ని ముగించుకోవాలని ఫ్రాంచైజీ నిర్ణయించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే ఈ మార్పుపై అధికారిక ప్రకటనను ధ్రువీకరించాల్సి ఉంది. గత ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. జట్టు ప్రదర్శనలో నిలకడ లేకపోవడం, ఆటగాళ్ల గాయాలు, కొందరు కీలక ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలు ఫలితాలపై ప్రభావం చూపినట్లు కథనాలు వెలువడ్డాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు ఉన్నాయన్న వార్తలు కూడా అప్పట్లో చర్చకు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాబోయే సీజన్ కోసం కొత్త ప్రధాన కోచ్‌ను నియమించే అంశంపై ఫ్రాంచైజీ దృష్టి సారించినట్లు సమాచారం. కొత్త కోచ్ ఎంపిక కోసం పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తదుపరి కోచ్ ఎవరనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మహేల జయవర్ధనేకు ముంబై ఇండియన్స్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. 2017లో జట్టు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన మార్గదర్శకత్వంలో ముంబై 2017, 2019, 2020 సీజన్లలో ఐపీఎల్ టైటిళ్లు గెలుచుకుంది. దీంతో ఫ్రాంచైజీ విజయాల్లో కీలక పాత్ర పోషించిన కోచ్‌లలో ఆయన ఒకరిగా గుర్తింపు పొందాడు. జట్టు ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, అభిమానులతో కలిసి ఎన్నో మధుర జ్ఞాపకాలను సృష్టించుకున్నామని జయవర్ధనే పేర్కొన్నట్లు సమాచారం. తనపై నమ్మకం ఉంచిన నీతా అంబానీ, ఆకాశ్ అంబానీలకు కృతజ్ఞతలు తెలిపినట్లు కథనాలు వెల్లడించాయి. ముంబై ఇండియన్స్‌కు జయవర్ధనే అందించిన సేవలను నీతా అంబానీ ప్రశంసించినట్లు సమాచారం. ఆయన ఎప్పటికీ తమ 'వన్ ఫ్యామిలీ'లో భాగమేనని ఆమె పేర్కొన్నట్లు కథనాలు తెలిపాయి. కోచ్‌గా ఆయన సాధించిన విజయాలు, జట్టుతో ఏర్పరచుకున్న అనుబంధం ముంబై ఇండియన్స్ ప్రయాణంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. కొత్త కోచ్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడితేనే జట్టు తదుపరి ప్రణాళికలపై స్పష్టత రానుంది.

ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ కోచ్‌గా చమిందా వాస్!

న్యూఢిల్లీ, అక్టోబరు 17 : ఐపీఎల్ తదుపరి సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ తన కోచింగ్ బృందాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. శ్రీలంక మాజీ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ చమిందా వాస్‌ను జట్టు బౌలింగ్ కోచ్‌గా నియమించినట్లు ప్రకటించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో తనదైన ముద్ర వేసిన వాస్ అనుభవం జట్టు పేస్ విభాగానికి ఉపయోగపడుతుందని ఫ్రాంచైజీ భావిస్తోంది. చమిందా వాస్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోని మిచెల్ స్టార్క్, లుంగి ఎంగిడి, ముకేశ్ కుమార్, దుష్మంత చమీర వంటి పేసర్లతో కలిసి పనిచేయనున్నారు. ఎడమచేతి వేగంతో పాటు బంతిని స్వింగ్ చేయడంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వాస్, బౌలర్లకు సాంకేతికంగా మెరుగైన శిక్షణ అందించగలరు. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా బౌలింగ్ వ్యూహాలను రూపొందించడంలోనూ ఆయన అనుభవం జట్టుకు తోడ్పడే అవకాశం ఉంది. శ్రీలంక తరఫున సుదీర్ఘకాలం ఆడిన చమిందా వాస్ మూడు ఫార్మాట్లలో కలిపి 439 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. టెస్టుల్లో 355 వికెట్లు, వన్డేల్లో 400 వికెట్లు సాధించారు. బంతిని స్వింగ్ చేస్తూ కీలక సమయాల్లో వికెట్లు తీయడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్ వంటి భారత బ్యాటర్లకు కూడా ఆయన పలుమార్లు సవాలు విసిరారు. ఆటగాడిగా ఐపీఎల్‌లోనూ వాస్‌కు అనుభవం ఉంది. డెక్కన్ ఛార్జర్స్ తరఫున ఆడిన ఆయన, లీగ్‌లో తన బౌలింగ్ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆటగాడిగా సంపాదించిన అనుభవంతో పాటు కోచ్‌గా పనిచేసిన పరిజ్ఞానం ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ విభాగానికి ఉపయోగపడనుంది. ఈ నియామకంతో రాబోయే సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పేస్ బౌలింగ్ మరింత పటిష్ఠం కావాలని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే జట్టు ప్రదర్శనపై ఈ మార్పు ఎలాంటి ప్రభావం చూపుతుందో సీజన్ ప్రారంభమైన తర్వాతే స్పష్టమవుతుంది.



అంతర్జాతీయ క్రీడా టోర్నీలకు 50 కోట్ల సాయం!



న్యూఢిల్లీ, అక్టోబరు 17 : దేశంలో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయ పథకాన్ని ప్రకటించినట్లు సమాచారం. అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారుల ప్రతిభను మెరుగుపరచడంతో పాటు, దేశాన్ని ప్రపంచ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడం ఈ పథకం లక్ష్యంగా పేర్కొన్నారు. ఇందులో భాగంగా, దేశంలో అంతర్జాతీయ టోర్నీలు నిర్వహించే జాతీయ క్రీడా సమాఖ్యలకు పోటీల స్థాయిని బట్టి గరిష్ఠంగా రూ.50 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ పథకం కింద వివిధ క్రీడా విభాగాలకు వాటి అంతర్జాతీయ ప్రాధాన్యం, సాధించిన విజయాలు, పోటీల స్థాయిని బట్టి ఆర్థిక సాయం కేటాయించనున్నట్లు సమాచారం. ఒలింపిక్స్ లేదా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో పతకాలు సాధించిన క్రీడలకు సంబంధించిన అంతర్జాతీయ పోటీల నిర్వహణకు గరిష్ఠంగా రూ.50 కోట్ల వరకు అందించే అవకాశం ఉంది. అంతర్జాతీయ స్థాయిలో టాప్-16 ర్యాంకింగ్స్‌లో ఉన్న క్రీడలకు రూ.20 కోట్లు, అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించిన ఇతర క్రీడలకు రూ.10 కోట్ల వరకు సాయం అందించనున్నట్లు కథనంలో పేర్కొన్నారు. అయితే ఈ మొత్తాలు, అర్హత ప్రమాణాలను సంబంధిత అధికారిక మార్గదర్శకాలతో ధ్రువీకరించాల్సి ఉంది. ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన లేదా పాల్గొనే ఒలింపిక్ క్రీడా విభాగాలకు సంబంధించిన పోటీల నిర్వహణకు గరిష్ఠంగా రూ.20 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించనున్నట్లు సమాచారం. ఈ నిధులు అంతర్జాతీయ పోటీలను దేశంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లకు ఉపయోగపడనున్నాయి. ఈ ఆర్థిక సాయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేయడం, పోటీదారులకు మెరుగైన వసతి, రవాణా, వైద్య సదుపాయాలు కల్పించడం వంటి ఏర్పాట్లకు అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ టోర్నీల నిర్వహణ పెరిగితే భారత క్రీడాకారులకు స్వదేశంలోనే ప్రపంచ స్థాయి ఆటగాళ్లతో పోటీపడే అవకాశం లభిస్తుంది. అలాగే, క్రీడా రంగానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు, నిర్వహణ నైపుణ్యాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అయితే పథకం అమలు, నిధుల మంజూరు, అర్హత ప్రమాణాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనను పరిశీలించాల్సి ఉంది.

జైస్వాల్‌కు అన్యాయం చేశారు: అశ్విన్



న్యూఢిల్లీ, అక్టోబరు 17 : న్యూజిలాండ్ పర్యటన కోసం ప్రకటించిన భారత వన్డే జట్టులో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు చోటు దక్కకపోవడంపై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. వరుసగా పరుగులు సాధించే సత్తా ఉన్న ఆటగాడికి తగిన అవకాశాలు కల్పించకపోవడం సరికాదని అభిప్రాయపడ్డాడు. ఇలాగే కొనసాగితే జైస్వాల్ ఆత్మవిశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు ప్రకటించిన జట్టులో జైస్వాల్‌కు చోటు దక్కకపోవడాన్ని అశ్విన్ తప్పుబట్టాడు. శుభ్‌మన్ గిల్ అందుబాటులో లేని పరిస్థితి ఎదురైతే అతడి స్థానంలో జైస్వాల్‌కు అవకాశం ఇవ్వాల్సిందని అభిప్రాయపడ్డాడు. ప్రతిభ ఉన్న ఆటగాళ్లకు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడే అవకాశాలు కల్పించడం జట్టు యాజమాన్యం, సెలెక్టర్ల బాధ్యతని పేర్కొన్నాడు. జైస్వాల్ గతంలో పరుగుల వరద పారించిన ఆటగాడని గుర్తుచేస్తూ, ప్రస్తుతం అతడికి తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించడం లేదని అశ్విన్ ఆందోళన వ్యక్తం చేశాడు. కేవలం అవకాశాల కోసం మాట్లాడటం లేదని, ఆటగాడి ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు దృష్ట్యా ఈ విషయం ముఖ్యమని వివరించాడు. గత రెండేళ్లలో జైస్వాల్ బ్యాటింగ్‌లో కొన్ని మార్పులు కనిపిస్తున్నాయని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. అతడు తిరిగి తనదైన లయను అందుకోవాలంటే తగినంత మ్యాచ్ సమయం, జట్టు మద్దతు అవసరమని చెప్పాడు. టెస్టు క్రికెట్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని అంగీకరిస్తూనే, ఇతర ఫార్మాట్లలోనూ ఆడే అవకాశాలు కల్పించాలని సూచించాడు. జైస్వాల్ చివరిసారిగా ఎప్పుడు వన్డే, టీ20 మ్యాచ్‌లు ఆడాడనే విషయాన్ని కూడా అశ్విన్ ప్రస్తావించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడే అవకాశం ఆటగాడికి ఎంతో విలువైనదని పేర్కొన్నాడు. తాను సెలెక్షన్ కమిటీలో ఉండి ఉంటే జైస్వాల్‌ను పిలిచి, రెండు మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం ఇస్తే సిద్ధంగా ఉన్నావా? అని అడిగేవాడినని అశ్విన్ వ్యాఖ్యానించాడు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం కంటే గొప్పది మరొకటి లేదని అభిప్రాయపడ్డాడు. యువ ఆటగాళ్ల ప్రతిభను గుర్తించి, వారికి తగిన అవకాశాలు కల్పించడం ద్వారా జట్టు భవిష్యత్తును బలోపేతం చేయవచ్చన్నది అశ్విన్ వ్యాఖ్యల సారాంశం. జైస్వాల్‌కు రాబోయే రోజుల్లో ఏ ఫార్మాట్‌లో అవకాశాలు లభిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

కోహ్లీని అహంకారి అనుకున్నా..



న్యూఢిల్లీ, అక్టోబరు 17 : టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ వ్యక్తిత్వంపై దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీని తొలిసారి కలిసినప్పుడు అతడిని అహంకారిగా భావించానని వెల్లడించాడు. అయితే, అది అహంకారం కాదని, తన సామర్థ్యంపై కోహ్లీకి ఉన్న బలమైన నమ్మకమే అలా కనిపించడానికి కారణమని వివరించాడు. వయసు పెరిగే కొద్దీ కోహ్లీలో వ్యక్తిత్వ పరంగా ఎంతో పరిణతి వచ్చిందని పేర్కొన్నాడు. ప్రఖర్ గుప్తాతో జరిగిన పాడ్‌కాస్ట్‌లో డివిలియర్స్ ఈ విషయాలను పంచుకున్నాడు. కోహ్లీని మొదటిసారి కలిసినప్పుడు అతడిని నిజంగానే అహంకారిగా, పొగరుబోతుగా భావించారా? అని అడగ్గా.. అవునని సమాధానమిచ్చాడు. ఈ విషయం కోహ్లీకి కూడా తెలుసని, తాను ఈ వ్యాఖ్యలను సరదాగానే చెబుతుంటానని వివరించాడు. 19 నుంచి 21 ఏళ్ల వయసులో కోహ్లీ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉండేవాడని డివిలియర్స్ తెలిపాడు. తన సామర్థ్యంపై అతడికి గట్టి నమ్మకం ఉండేదని, అదే కొన్నిసార్లు ఇతరులకు అహంకారంలా కనిపించేదని చెప్పాడు. ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ఆటగాడికి తనపై తనకు నమ్మకం ఉండటం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున కలిసి ఆడిన కోహ్లీ, డివిలియర్స్ మధ్య మంచి స్నేహం ఏర్పడింది. మైదానంలో భాగస్వామ్యాలతో పాటు మైదానం బయట కూడా వీరిద్దరి అనుబంధం కొనసాగింది. దీంతో కోహ్లీ ఆటతీరును, వ్యక్తిత్వాన్ని దగ్గరగా గమనించే అవకాశం డివిలియర్స్‌కు లభించింది. కాలక్రమంలో కోహ్లీలో ఎంతో మార్పు వచ్చిందని డివిలియర్స్ పేర్కొన్నాడు. చిన్న వయసులో తనను తాను నిరూపించుకోవాలనే తపన ఎక్కువగా ఉండేదని, విజయాలు సాధిస్తూ ముందుకు సాగిన కొద్దీ ఆ అవసరం తగ్గిందని వివరించాడు. ప్రస్తుతం కోహ్లీ వ్యక్తిగా, క్రికెటర్‌గా మరింత పరిణతి సాధించాడని తెలిపాడు. డివిలియర్స్ వ్యాఖ్యలు కోహ్లీ కెరీర్‌లోని ఎదుగుదలను, ఆత్మవిశ్వాసం నుంచి పరిణతి వైపు సాగిన అతడి ప్రయాణాన్ని మరోసారి చర్చకు తీసుకొచ్చాయి.

వైభవ్ పోస్ట్ వైరల్.. తుది టీ20లో ఛాన్స్ దక్కేనా?



బెంగళూరు, అక్టోబరు 17: భారత్, వెస్టిండీస్ మధ్య టీ20 సిరీస్ తుది పోరుపై ఆసక్తి నెలకొంది. ఇరు జట్లు చెరో రెండు విజయాలతో సమంగా నిలవడంతో చివరి మ్యాచ్ సిరీస్ విజేతను నిర్ణయించనుంది. ఈ కీలక సమయంలో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఓ పోస్టు చర్చకు దారితీసింది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాని వైభవ్.. చివరి టీ20లోనైనా బరిలోకి దిగుతాడా అన్న ఉత్కంఠ అభిమానుల్లో పెరిగింది. భారత జట్టులో చోటు దక్కించుకున్న వైభవ్ సూర్యవంశీ తొలి నాలుగు మ్యాచ్‌ల్లోనూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఓపెనర్లుగా సంజు శాంసన్, అభిషేక్ శర్మలకు జట్టు యాజమాన్యం ప్రాధాన్యం ఇవ్వడంతో అతడికి తుది జట్టులో అవకాశం రాలేదు. ఈ నేపథ్యంలో వైభవ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో 'స్టిల్ బిలీవింగ్' అనే అర్థం వచ్చేలా పోస్టు పెట్టినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అంటే, 'ఇప్పటికీ నమ్మకంతోనే ఉన్నా' అనే భావం. ఈ పోస్టుతో చివరి మ్యాచ్‌లో అతడికి అవకాశం దక్కుతుందా? అనే చర్చ మొదలైంది. అయితే ఈ పోస్టు జట్టు ఎంపికకు సంబంధించినదేనని నిర్ధారించలేం. సిరీస్ విజయం కోసం భారత్ చివరి మ్యాచ్‌లో బరిలోకి దిగనుంది. ఇలాంటి కీలక పోరులో జట్టు యాజమాన్యం ఓపెనింగ్ జోడీని మారుస్తుందా? లేక ఇప్పటికే ఆడుతున్న ఆటగాళ్లకే మరో అవకాశం ఇస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గతంలో జట్టు ఎంపికలో ఆటగాళ్ల ఫామ్‌తో పాటు జట్టు సమతూకం, వ్యూహాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పినట్లు కథనాలు వెల్లడించాయి. అందువల్ల వైభవ్ మంచి ప్రతిభ కలిగిన ఆటగాడైనా, తుది జట్టులో చోటు దక్కడం ఖాయమని చెప్పలేం. వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో జట్టు యాజమాన్యం ఎలాంటి కూర్పుతో బరిలోకి దిగుతుందనేది టాస్ సమయంలోనే స్పష్టమవుతుంది. వైభవ్‌కు అవకాశం ఇస్తారా? లేక ప్రస్తుత ఓపెనింగ్ జోడీనే కొనసాగిస్తారా? అన్నది వేచి చూడాలి.



యోధురాలిగా సాయిపల్లవి..

'రామాయణం' ప్రోమోపై ఆసక్తి!

హైదరాబాద్, అక్టోబరు 17 : నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణం' మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ సినిమాలో సీతాదేవిగా నటిస్తున్న సాయిపల్లవి చేతిలో కత్తితో యోధురాలి రూపంలో కనిపిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీశాయి. ఈ కొత్త ప్రచార చిత్రంలో సీత పాత్రను విభిన్నంగా చూపించారంటూ అభిమానులు ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వెండితెరపై సీతాదేవి పాత్రను సహనం, త్యాగం, కుటుంబ విలువలకు ప్రతీకగా చూపిస్తుంటారు. అయితే ఈ చిత్రంలో ఆమె ధైర్యసాహసాలను కూడా ఆవిష్కరించేలా రూపకల్పన చేసినట్లు ప్రచార చిత్రంలోని దృశ్యాలు సూచిస్తున్నాయి. చేతిలో కత్తితో యోధురాలిగా సాయిపల్లవి కనిపించడం సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, యశ్ రావణుడిగా, సాయిపల్లవి సీతాదేవిగా నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్, హాన్స్ జిమ్మర్ సంగీత బాధ్యతలు చేపట్టినట్లు సమాచారం. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం ప్రణాళిక రూపొందించింది. 'రామాయణం' విడుదల తేదీ, తాజా ప్రచార చిత్రానికి సంబంధించిన వివరాలపై అధికారిక ప్రకటనలను పరిశీలించాల్సి ఉంది. ముఖ్యంగా నవంబర్ 5న దీపావళి సందర్భంగా తొలి భాగం విడుదల కానుందన్న ప్రచారానికి అధికారిక ధృవీకరణ అవసరం. సీతాదేవి పాత్రలో సాయిపల్లవి కనిపించనున్న తీరు మాత్రం అభిమానుల్లో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఆడిషన్ లేకుండానే..

హైదరాబాద్, అక్టోబరు 17 : ఇతర భాషల నుంచి వచ్చి టాలీవుడ్‌లో అవకాశాలు దక్కించుకోవడం అంత సులభం కాదు. ముఖ్యంగా తెలుగు భాష తెలియని సమయంలో ఆడిషన్స్‌కు హాజరవడం నటీనటులకు సవాలుతో కూడుకున్నదే. అయితే మలయాళ నటి అనశ్వర రాజన్‌కు మాత్రం తన తొలి తెలుగు సినిమా విషయంలో ఓ ఆసక్తికరమైన అనుభవం ఎదురైంది. 'ఛాంపియన్' సినిమా కోసం ఆడిషన్‌కు వెళ్లినప్పుడు తనను ఎంపిక చేయలేదని భావించానని, చివరకు ఆడిషన్ అవసరం లేకుండానే అవకాశం దక్కిందని ఆమె గుర్తుచేసుకుంది. 'ఛాంపియన్' సినిమా కోసం 2024 ఏప్రిల్‌లో చిత్ర నిర్మాణ సంస్థ నుంచి తనకు ఫోన్ వచ్చిందని అనశ్వర రాజన్ తెలిపింది. ఆ తర్వాత నిర్వహించిన లుక్ టెస్ట్ కోసం హాఫ్ శారీ ధరించి వెళ్లినట్లు వెల్లడించింది. అక్కడ నిర్మాత సాయి, సహాయ దర్శకుడు తనకు కొన్ని సంభాషణలతో కూడిన స్క్రిప్ట్ ఇచ్చి సాధన చేయాలని సూచించారట. తనకు తెలుగు రాదని చెప్పడంతో, ఆంగ్లంలోనే సంభాషణలు చెప్పవచ్చని వారు భరోసా ఇచ్చినట్లు అనశ్వర తెలిపింది. దీంతో అక్కడే డైలాగ్స్ సాధన చేస్తూ ఆడిషన్‌కు సిద్ధమైంది. దర్శకుడు ప్రదీప్ అద్వైతం కూడా అక్కడే ఉన్నారని ఆమె గుర్తుచేసుకుంది. అనశ్వర సంభాషణలు సాధన చేస్తున్న సమయంలో స్వప్న దత్ అక్కడికి వచ్చి ఆమెను చూసి ఓకే అని చెప్పి వెళ్లిపోయారట. ఆ తర్వాత దర్శకుడు ప్రదీప్ అద్వైతం, నిర్మాత సాయి సహా అక్కడున్నవారంతా వెళ్లిపోయారు. కొద్దిసేపటికి తిరిగి వచ్చిన నిర్మాత సాయి.. ఆడిషన్ అవసరం లేదని, ఇక సంభాషణలు చెప్పాల్సిన పని లేదని చెప్పారట. దీంతో అనశ్వర అయోమయానికి గురైందట. తనను ఎంపిక చేయలేదని, సినిమా నుంచి తప్పించేశారని భావించి ఇంటికి వెళ్లిపోవచ్చని అనుకుందట. కారణం ఏమిటని పదేపదే అడిగినా, ఆడిషన్ అవసరం లేదనే సమాధానమే రావడంతో అసలు విషయం అర్థం కాలేదని ఆమె వెల్లడించింది. చివరకు తనను ఎంపిక చేసినందువల్లే ఆడిషన్ అవసరం లేదని తెలుసుకున్న అనశ్వర ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తిరస్కరణ ఎదురైందని భావించిన సమయంలోనే సినిమా అవకాశం దక్కిందని తెలిసి ఎంతో సంతోషించానని ఆమె తెలిపింది. మలయాళ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న అనశ్వర రాజన్, 'ఛాంపియన్'తో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యే ప్రయత్నం చేస్తోంది. తన తొలి తెలుగు సినిమా ఎంపిక వెనుక ఉన్న ఈ అనుభవం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.



'ఐ హేట్ మ్యారేజ్' టీజర్ విడుదల!



హైదరాబాద్, అక్టోబరు 17 : ప్రేమ, పెళ్లి, కెరీర్, స్వతంత్ర జీవనం.. నేటి యువత ఆలోచనలను ప్రతిబింబిస్తూ తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్'. సుగి విజయ్, జుప్సీ భద్ర జంటగా నటిస్తున్న ఈ సినిమాతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్య సినిమా పతాకంపై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'అప్పుడే పెళ్లా' పాటకు సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన లభించగా, తాజాగా చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ప్రేమ, పెళ్లి విషయంలో నేటి తరం ఎదుర్కొంటున్న సందిగ్ధతలు, కెరీర్‌కు ఇస్తున్న ప్రాధాన్యం, స్వతంత్రంగా జీవించాలనే ఆలోచనలను ఈ చిత్రంలో చూపించనున్నట్లు దర్శకుడు పరమేశ్ రేణుకుంట్ల తెలిపారు. టీజర్ విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత జీవితాల్లో ఎదురయ్యే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశామని చెప్పారు. సినిమాలోని పాత్రలతో యువత సులభంగా అనుసంధానమవుతారని, కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీరితో పాటు పృథ్వీరాజ్, రవివర్మ అడ్డూరి, ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్, బేబీ తమోష్ణు, రాధ రాయసం, లక్ష్మి, జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మరేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి తదితరులు నటిస్తున్నారు. విజయ్ సి. కుమార్ ఛాయాగ్రహణం అందించగా, వరికుప్పల యాదగిరి సంగీతం, పాటలను సమకూర్చారు. ప్రవీణ్ ఇమ్మడి నేపథ్య సంగీతం అందిస్తున్నారు. ఆవుల వెంకటేష్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టగా, మోహన్ జల్లా కళా దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు చాణక్య, రాజ్ కృష్ణ నృత్యరీతులు సమకూర్చారు. మాదం దయానంద్, కార్తిక్ వెంపటి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, సంతోష్ రేణికుంట్ల, కాశీగారి కోదండ రామశర్మ సహ నిర్మాతలుగా ఉన్నారు. 'అప్పుడే పెళ్లా' పాటతో ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుకున్న 'ఐ హేట్ మ్యారేజ్'.. టీజర్‌తో మరింత చర్చలోకి వచ్చింది. యువత ప్రేమ, పెళ్లి, జీవిత నిర్ణయాలపై ఈ సినిమా ఎలాంటి కథనాన్ని అందిస్తుందో చూడాలి.



విజయ్ సేతుపతి

'స్లమ్‌డాగ్' షూటింగ్ పూర్తి!



హైదరాబాద్, అక్టోబరు 17 : క్రేజీ దర్శకుడు పూరి జగన్నాథ్, తమిళ నటుడు విజయ్ సేతుపతి కలయికలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్లమ్‌డాగ్-33 టెంపుల్ రోడ్' షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. భావోద్వేగాలతో కూడిన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. త్వరలోనే విడుదల తేదీని వెల్లడించనున్నట్లు మేకర్స్ తెలిపారు. పూరి కనెక్ట్స్ పతాకంపై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో టబు, జరీనా వహాబ్, సంయుక్త మీనన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విజయ్ సేతుపతి నటనకు పూరి జగన్నాథ్ ప్రత్యేకమైన కథనశైలి తోడవడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. రమేష్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. షూటింగ్ పూర్తవడంతో ప్రస్తుతం నిర్మాణానంతర పనులపై దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. విడుదల తేదీతో పాటు ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది. విజయ్ సేతుపతి-పూరి జగన్నాథ్ కలయికలో వస్తున్న ఈ చిత్రం ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తుందోనన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

'జనవరి 12 విడుదల'లో కీర్తి సురేశ్..

పవర్‌ఫుల్ పాత్ర!

హైదరాబాద్, అక్టోబరు 17 : టాలెంటెడ్ హీరోయిన్ కీర్తి సురేశ్ పుట్టినరోజు సందర్భంగా 'జనవరి 12 విడుదల' చిత్ర బృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సినిమాలో ఆమె 'లతా రెడ్డి' అనే విభిన్నమైన, శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ పోస్టర్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. వెంకటేశ్ కథానాయకుడిగా, నందమూరి కల్యాణ్ రామ్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. మాస్, కుటుంబ వినోద అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కీర్తి సురేశ్ పాత్ర కథలో కీలకంగా నిలవనుందని చిత్ర వర్గాల సమాచారం. ఆమె పాత్రకు సంబంధించిన తాజా అప్‌డేట్‌తో సినిమాపై అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే అంచనాలు నెలకొన్నాయి. వినోదంతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఇందులో ఉండనున్నట్లు తెలుస్తోంది. 'జనవరి 12 విడుదల' చిత్రాన్ని 2027 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే రోజుల్లో సినిమా నుంచి మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com